

Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

జమీందారైమ

సంపుటి: 82 • సంచిక: 13 • 1-4-2011 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-



జగన్‌ను ఎదిరించడం కాంగ్రెస్ తరమా?

● *అభ్యర్థులు దొరకక నానాపాట్లు పడుతున్న ప్రధాన పార్టీలు.*

కడప పార్లమెంట్, పులివెందుల శాసన సభ నియోజకవర్గాలకు ఉప ఎన్నికల ప్రకటన వెలువడింది. రాష్ట్ర రాజకీయాలు సమస్తం రానున్న ఒకటిన్నర నెల కాలం కడప జిల్లాలోనే గిరికీలు కొడతాయి. లోక్‌సభకు జగన్, శాసన సభకు ఆయన తల్లి శ్రీమతి విజయలక్ష్మి పోటీ చేయబోతున్నారు. ఈ పోటీ జగన్‌కు జీవన్మరణ సమస్య. ఇక్కడ గెలుచుకొని వస్తేనే ఆయనకు రాజకీయ భవిష్యత్తు. ఆయన కొత్తగా పెట్టిన పార్టీకి పుట్టగతులు. ఏ మాత్రం ఫలితం అటు ఇటు అయినా అంతే సంగతులు. అందువల్ల ఈ ఎన్నికలను జగన్ ఎంత తీవ్రంగా తీసుకొంటాడో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. సర్వం ఒడ్డి పోరాడుతాడు.

జగన్‌ను రాజకీయంగా విభేదించే కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలకు కూడా అంతే బ్రతుకు తెరువు పోరాటం. ఈ దశలో జగన్‌ను అడ్డుకొంటే, ముందు రోజులలో పెద్ద ప్రమాదం తప్పుతుంది. అయితే పార్లమెంట్‌కు పోటీ చేయడానికి ఆ రెండు పార్టీలకు అభ్యర్థులు దొరకడం లేదు. వైఎస్ వివేకానందరెడ్డిని లోక్‌సభకు నిలపాలన్నది కిరణ్‌కుమార్‌రెడ్డి ఆలోచన. కానీ తనకు పులివెందుల శాసనసభ స్థానమే ఇష్టమని చెప్పున్నాడు వివేకానందరెడ్డి. అక్కడ తనకున్న పరిచయాలు, అనుచరగణం వల్ల తాను ఖచ్చితంగా గెలవగలనని భావిస్తున్నారాయన.

ఆయన లేనప్పుడు ఎవరిని నిలపాలి? డిఎల్.రవీంద్రరెడ్డి పేరు ప్రస్తావనకు వచ్చినా, వైఎస్ అనుచర వర్గం ఆయన్ను తీవ్రంగా వ్యతిరేకిస్తుంది కాబట్టి, ఆ ఓట్లలో చీలిక రాక ఇబ్బందులు వస్తాయన్నది భయం. మాజీ ఎమ్పీ కందుల రాజమోహన్‌రెడ్డి పేరు వెలుగులోకి వస్తున్నది. ఆయన వైఎస్ అనుచరుడు కాకపోయినా, వైఎస్ అనుచరులలో ఆయన పట్ల అంత వ్యతిరేకత వుండకపోవచ్చు. అయితే ఇదే రాజమోహన్‌రెడ్డి కోసం తెలుగుదేశం పార్టీ కూడా గాలం వేస్తున్నది. వారికీ అభ్యర్థి సమస్యే. మైసూరారెడ్డిని రంగంలోకి దింపాలన్న ఆలోచన చంద్రబాబుకు వుంది. అయితే తాను గెలిస్తే ఫర్వాలేదు, ఒకవేళ ఓడితే నా రాజకీయ భవిష్యత్తు ఏమిటి? మళ్లీ రాజ్యసభ ఇస్తారా అని అడుగుతున్నాడట మైసూరారెడ్డి. మా పార్టీలోకి వస్తే, మీకు టిక్కెట్ ఇస్తామని కిరణ్‌కుమార్‌రెడ్డి సైతం మైసూరారెడ్డికి రాయబారాలు నడుపుతున్నాడు.

రెండు పార్టీలలో ఒకే అభ్యర్థి కోసం తాపత్రయపడే విచిత్ర పరిస్థితి, కడప ఎన్నికలో జగన్ ప్రభావ తీవ్రతను చెప్పకనే చెప్పున్నది. జగన్‌తో పోటీకి సరైన అభ్యర్థిని కూడా ఎంపిక చేసుకోలేని పరిస్థితిలో, జగన్‌ను రాజకీయంగా ఎదిరించి నిలవడం కాంగ్రెస్ తరమా అన్నది ప్రశ్న. మొదట మొదట వైఎస్.వివేకానందరెడ్డి, డిఎల్.రవీంద్రరెడ్డి, కేంద్ర మంత్రి సాయి ప్రతాప్ వంటి వారి వల్ల కడప జిల్లాలో జగన్‌కు ప్రతికూలంగా పెద్ద ఎత్తున కార్యకర్తలను సమీకరించిన మాట నిజం. అయితే మొన్నటి శాసనమండలి ఎన్నికలలో జగన్ అభ్యర్థి విజయం తర్వాత, అదే కార్యకర్తలలో ఆలోచనలు మారి పోతున్నాయి.. జగన్‌ను ఎదిరించి నిలువగల సత్తా కాంగ్రెస్‌కు వుందా లేదా అన్న సందేహం కార్యకర్తలలో కల్గుతున్నది. దానితో వారు ఇదివరకటి వలె జగన్ వ్యతిరేక కార్యక్రమాలలో పాల్గొనడం లేదు. ఈ పరిస్థితిని తనకనుకూలంగా మలచుకోవడానికి జగన్ అన్ని ఎత్తులూ ఎత్తుతున్నాడు. మొత్తం మీద కడప ఉప ఎన్నికలు రాష్ట్ర రాజకీయాలలో పెను సంచలనాలకు దారి తీయడం ఖాయం.

కార్టూన్ స్కేప్



అబ్బె... భూకంపం ఏం రాలేదురా! మొన్న భూ కేటాయింపులపై పక్కనున్న అసెంబ్లీ దద్దరిల్లింది అంతే!!



నల్ల ధన మసూచి

భారతదేశ ఆర్థిక రంగాన్ని నల్లధనం సమస్య ఆది నుంచీ పీడిస్తూనే వుంది. ఎన్ని సంస్కరణలు ప్రవేశపెట్టినా నల్లధన ప్రవాహం కట్టలు తెంచుకొని ప్రవహిస్తూనే వుంది తప్ప అడ్డుకట్ట పడడం లేదు. రాను రాను అది దేశ ప్రగతికి తీవ్ర అవరోధంగా మారుతున్నది. భయంకరమైన మసూచి వ్యాధి వలె ఆర్థిక వ్యవస్థను క్షీణింప చేస్తున్నది. అదొక విష వలయం వంటిది. ప్రజల సంక్షేమం కోసం వెచ్చించే ప్రతి రూపాయీ ప్రజల నుంచే రాబట్టుకోవాలి. కానీ పారిశ్రామికవేత్తలు, వ్యాపార వర్గాలు పన్నుల ఎగవేత మార్గంలో ఏటా కొన్ని లక్షల కోట్ల రూపాయలను నల్లధనంగా మార్చుకొంటున్నారు. మరొకప్రక్క బడ్జెట్ల రూపంలో ప్రభుత్వం వెచ్చించే లక్షలాది రూపాయలలో సింహభాగాన్ని రాజకీయవాదులు, అధికారులు కుమ్మక్కై తమ జేబులలోకి తరలిస్తున్నారు. దానితో ప్రజలకు రెండు వైపులా నష్టం జరుగుతున్నది. బడ్జెట్ పరిపుష్టికి కావాలసినన్ని నిధులు పన్నుల రూపంలో అందుబాటులోకి రావడం లేదు. వచ్చిన నిధులలో అధిక భాగం ప్రజల కోసం వెచ్చించే అవకాశం లభించడం లేదు.

ఏటా లక్షల కోట్లలో పోగుపడుతున్న నల్లధనం కొందరు వ్యక్తుల ఇళ్లలో, స్విస్ బ్యాంకులలో వృధాగా పడి మూలుగుతున్నది. దేశం మొత్తం మీద చలామణిలో వున్న నల్లధనాన్ని ప్రభుత్వ ఖజానా అందుబాటులోకి తేగలిగితే, భారతదేశం పదేళ్లలో అమెరికాను మించిన అభివృద్ధి సాధించగలదని అంచనా. ఒక్క స్విస్ బ్యాంకులలో మూలుగుతున్న భారతీయుల నల్లధనం పరిమాణమే 50 నుంచి 70 లక్షల కోట్ల రూపాయలని అంచనా. దాన్ని తిరిగి రాబట్టగలిగితే, దేశంలోని ప్రతి ఎకరాకూ నీటిపారుదల సౌకర్యం కల్పించవచ్చు. విద్యుత్ కొరత అన్నది లేకుండా చేయవచ్చు. కరవు కాటకాల నుంచి, వరదలు ఉప్పెనల నుంచి కోట్లాది మంది ప్రజలను శాశ్వతంగా విముక్తి చేయవచ్చు.

కానీ ఈ విషయంలో గత అరవై ఏళ్లుగా ప్రభుత్వాలన్నీ విఫలమౌతున్నాయి. నల్లధనాన్ని అరికట్టడానికి చేసే ప్రయత్నమూ ఆ మహమ్మారి మరింత తీవ్రస్థాయిలో విజృంభించడానికి మాత్రమే ఉపకరిస్తున్నది. ఈ భయంకర ఆర్థిక మసూచి రోగానికి ఒక ఉదాహరణ వంటి వాడు హసన్ ఆలీ. ముప్పై ఏళ్ల క్రితం హైదరాబాద్ ఛార్మినార్ ప్రాంతంలో పాత సామాను అమ్ముకొనే చిరు వ్యాపారి అతడు. కానీ ఈ రోజు ఒకే ఒక్క స్విస్ బ్యాంక్ ఖాతాలో 40వేల కోట్ల రూపాయల నల్లధనం దాగి వుంది. ప్రపంచంలో మరెన్ని బ్యాంకులలో ఇంకెంత నల్లధనం జమ అయ్యి వుందో ఎవరికీ తెలియదు. ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం అతడికి 50వేల కోట్ల రూపాయల పన్ను కట్టాలని నోటీసు ఇచ్చింది. అతడికి ఇంత సంపద ఎట్లా వచ్చిందో తెలుసుకోవడం భారత ప్రభుత్వ తరం కాలేదు. కనీసం అతడి చేత ఒక రూపాయి పన్ను కూడా కట్టించలేక పోతున్నది ప్రభుత్వం. దేశంలో ఇటువంటి హసన్ ఆలీలు ఇంకెంత మంది వున్నారో, వారి దగ్గర ఎన్నేసి లక్షల కోట్ల రూపాయలు పోగు పడి వున్నాయో అంచనాకు కూడా అందని విషయం. హసన్ ఆలీ మీద ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సుప్రీంకోర్టు గద్దించిన తర్వాత కానీ భారత సర్కారు దర్యాప్తు ప్రారంభించలేదు. ఆ తర్వాత కూడా అతడి జోలికి వెళ్తే తమకు ప్రాణ ప్రమాదం వుందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వున్నతాధికారులు అదే కోర్టుకు మొరపెట్టుకొన్నారే తప్ప, అతడి ఖాతాలలో చెదలు పడుతున్న నల్లధనాన్ని వెలికి తీయడానికి ప్రయత్నించడం లేదు. హసన్ ఆలీతో ఆంధ్ర, మహారాష్ట్ర, తమిళనాడు వంటి రాష్ట్రాలకు చెందిన రాజకీయ నేతలు పలువురికి సంబంధాలున్నాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చెప్తున్నది. కానీ వారి పేర్లు బయటపెట్టడానికి భయపడుతున్నది.

జమీన్‌రైతు

దేశ ఆర్థిక రంగాన్ని పట్టి పీడిస్తున్న నల్ల ధన మహమ్మారిని నిర్మూలించడంలో ప్రభుత్వ అసమర్థత, అసహాయత ఎంత దారుణంగా వున్నాయో అర్థం చేసుకోవడానికి హసన్ ఆలీ ఉదంతం ఒక ఉదాహరణ. గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు వేలు లక్షల సంఖ్యలో వున్న హసన్ ఆలీ లందరినీ గుర్తించి, వారి నేల మాళిగలలో మూలుగుతున్న నల్లధనంలో కొంత భాగాన్ని వెలికి తీసినా దేశానికి పేదరిక శాపం నుంచి విముక్తి కల్గుతుంది. సుప్రీంకోర్టు ఒత్తిడి వల్ల అయినా ప్రభుత్వం ఆ దిశలో కృషి ప్రారంభించి, చిత్తశుద్ధితో కొనసాగిస్తుందని ఆశిద్దాము.

జనవాణి

ప్రొఫెసర్లు– ప్రత్యక్ష రాజకీయాలు!

ప్రభుత్వ వుద్యోగం లేదా ప్రయివేటు విద్యాసంస్థలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాలలో పనిచేస్తూ, ప్రత్యక్ష రాజకీయాలలో పాల్గొంటూ రేపటి పౌరుల భావిభారత నిర్మాతలైనవారు ప్రత్యక్ష రాజకీయాలలో పాల్గొనడం ఎంతవరకు సబబు? తమ ప్రాంతం వారి మనసులను రాజకీయంగా ప్రభావితం చేస్తూ వేరు ప్రాంతాల, వేరు రాజకీయ భావాలు గల విద్యార్థినీ విద్యార్థులపై సవతి తల్లి ప్రేమ చూపడం తగదు. యుజిసి నిర్దేశక సూత్రాలు కూడా రాజకీయాలకు అధ్యాపకులు దూరంగా వుండాలంటున్నాయి.

ప్రొఫెసర్ నాగరాజారావు — హైదరాబాదు

మధ్యాహ్న భోజనం సరిలేదు!

అక్షరాస్యతను, స్కూళ్లలో విద్యార్థుల హాజరు పెంచేందుకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. కాని ఈ పథకం స్థితిగతులు సరిగా లేవు. ప్రభుత్వం నిధులను సరిగ్గా విడుదల చేయకపోవడం వల్ల నిర్వాహకులకు తలనొప్పిగా మారింది. మంచి బియ్యంతో అన్నం, సరైన కూరలు, కోడిగుడ్డు పెట్టడం లేదు. మధ్యాహ్న భోజన పథకాన్ని సరిగ్గా నిర్వర్తించలేని నాడు దీని రద్దు చేయడం వుత్తమం.

ఎం.రమణయ్య — కొడవలూరు

ఎందుకీ అదనపు నిధులు?

పార్లమెంటు సభ్యులకు నియోజకవర్గం అభివృద్ధి నిధిగా ఐదుకోట్ల రూపాయలివ్వడం అవినీతిని పరోక్షంగా ప్రోత్సహించడమే. నేటి నాయకుల్లో నీతికి నిలబడే వారు తక్కువ. సిబిఐ, ఎసిబి అధికారులు ఎంత ప్రయత్నించినా అవినీతిని రూపుమాపలేకపోతున్నారు. సమాజంలో నేను, నాది అనే భావన తుడిచిపెట్టుకపోయి మనము, మనది అనే భావన కలిగినపుడే ఈ అవినీతికి ముగింపు.

పి.అరుణకుమారి — నెల్లూరు

సోమిరెడ్డి వాఖ్యలు అనుచితం

జిల్లా కలెక్టర్ రాంగోపాల్‌పై తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వాఖ్యలు అనుచితం. సోమిరెడ్డి కలెక్టర్ స్థాయిని ప్రశ్నించడం సమర్థనీయం కాదు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి జిల్లా అభివృద్ధికి రాంగోపాల్ ఎంతో కృషి చేశారు. సంక్షేమ హాస్టళ్లలో సమస్యల పరిష్కారానికి కాల్‌సెంటర్‌ను, పిటీషన్ మానిటరింగ్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యలు తన దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరించారు. జిల్లా పారిశ్రామికాభివృద్ధికి ఇతోధికంగా కృషి చేశారు.

ఎన్.బి.రావ్ — కావలి

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

4-4-1941
పేజీలు : 12 వెల: అణా

మున్సిపల్ చెట్ల తొట్లు

నెల్లూరు మునిసిపాలిటీ వారు ట్రంకురోడ్డు పొడుగున అశోక చెట్లు నాటించారు. పాపం చివరకు వాటి గతి శోకమే అయింది. అవి చచ్చేదానికి రక్షణకు కాబోలు! వెదురుతో కొన్ని చట్రాలు బిగించి వాటి చుట్టూ అమర్చారు. వీటికిగాను 300 రూపాయలు వదలింది. గవర్నరు గారు వచ్చే నాటికి ఇవి ఎండిపోయి చాలా వికార రూపాలతో తయారైనవి. ఈ నష్టానికి బాధ్యులు ఎవరు? కమీషనరా? ఇంజనీరా? 300 రూపాయలు ప్రజల డబ్బు మేదర తడికలకుపోతే ఛైర్మన్ ఏమి చర్య తీసుకుంటాడో చూస్తాం.

జడ్జి భార్య ఎక్కడ కూర్చోవాల?

ఎవరు ఎక్కడ కూర్చోవాల? ఎవరికి ముందు తాంబూలం? అనేది సృష్ట్యాది నుండి వచ్చే ఘర్షణగా వుంది.

మొన్న గవర్నరు మన వూరు వస్తే కొత్త హాలులో జరిగిన ప్రాణ త్యాగపు దర్శనానికి అమర్చిన సీట్లలో గవర్నరు గారికి కుడి ఎడమల కలెక్టరు సతి, వెంకటగిరి రాజా కూర్చోవడం ప్రేక్షకులు చాలా మంది చూచినారు. జిల్లా జడ్జిగారు వృద్ధరాలు తమ ధర్మపత్ని స్థానం దూరమైందని కండ్లెరజేసి తగవు పెట్టుకొని గెలిచినారట! ఐసిఎస్ అయినా కరంతుల్లా గారు హైందవుడే గదా!

ఆంధ్ర సంపాదకులు

అధములు – మధ్యములు – ఉత్తములు మొదటి రెండు దశలు దాటి ఆంధ్ర సంపాదకులు చివరిదశకు భిన్నంగా వచ్చి ఒక సమావేశంలోనే సమావేశమై దిగ్విజయంగా పూర్తి చేసుకున్నారు.

50 ఏళ్ల క్రితం ఈవారం

31-3-1961
పేజీలు: 12 వెల: 0-20 న.పై

నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి మాతృప్రేమ

"నా తల్లి మరణానికై నే చింతించనవసరం లేకపోయినా 102 సంవత్సరాలు బ్రతికినందున మాయమ్మ సుదీర్ఘ మాతృ వాత్సల్యాన్ని అనుభవించిన నాకు ఆమె మరణం నన్నేదో లోపానికి గురి చేస్తున్నట్లున్నది. ఏదో తెలియని కొరత నాలో ఏర్పడినది... ఆమె పేరుతో యిప్పటికే వృత్తివిద్యల నేర్పు 'సీతమ్మ పారిశ్రామిక పాఠశాల'ను స్థాపించి నిర్వహించుచున్నాము. మా హాస్టలులో జబ్బుపడిన పిల్లలకై ప్రత్యేకముగ ఒక చికిత్సాలయమును ఆమె పేర నిర్మించినాను. ఇదిగాక పది పడకలతో మా గ్రామమున ఒక కాన్పుల వార్డు ఆమె పేర నిర్మించ నుద్దేశించియున్నాను. ఒకటి యననేల – నా జీవిత కార్యములన్నీ ఆమెకే అంకితమిస్తున్నాను. ఇట్టివి ఎన్ని చేసినను ఆమె ఋణాన్ని తీర్చుకొనలేను."

అని వెలిబుచ్చారు నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి – ఆమె ఉత్తరక్రియల సందర్భంలో వెలువరించిన 'మాయమ్మ సీతమ్మ'లో...

ముఖ్యమంత్రి

ముఖ్యమంత్రి సంజీవయ్య ఏప్రెల్ 3వ తేది మధ్యాహ్నం 12 గంటలకు తిరుపతి నుండి కారులో గూడూరుకు చేరి, అప్పుడే 1.22కు ఎక్స్‌ప్రెస్‌లో బెజవాడకు పోయెదరు.

కోట సభలు వున్నవి

2వ తేది కోటలో రైతు మహాసభ జరుగుతుందని, ఆర్థిక మంత్రి బ్రహ్మానందరెడ్డి, డాక్టర్ చెన్నారెడ్డి వగైరా నాయకులందరూ వస్తున్నారని నిర్వాహకులు తెల్పుతున్నారు. చక్కని రాజకీయ సంగీత సమ్మేళనం కోట సభలు.

నెల్లూరు ముచ్చట్లు

మేం కోటీశ్వరులం!

27వ తేది రాత్రి ఎబిఎన్ ఆంధ్ర జ్యోతి ఛానల్ ఆనం బ్రదర్స్ వివేకానంద రెడ్డి, రామనారాయణరెడ్డితో నిర్వహించిన 'ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే' కార్యక్రమంలో తాము ప్రస్తుతం కోటీశ్వరులమని వివేకానందరెడ్డి చెప్పుకొచ్చారు. చింతారెడ్డిపాళెం గ్రామంలో తమ తండ్రి వారసత్వంగా నలుగురు సోదరులకు ఇచ్చిన 120 ఎకరాలున్నాయని, ప్రస్తుతం అక్కడ ఎకరా కోటి రూపాయలని చెప్పారు. ఒక్కో సోదరునికి 30 ఎకరాలున్నందున కోటీశ్వరులమనే ఫీలింగ్‌తో సంతృప్తిగా వున్నామన్నారు.

పచ్చి అబద్ధాలు

ఎబిఎన్ ఆంధ్రజ్యోతి ఛానల్ ఆనం బ్రదర్స్‌తో నిర్వహించిన 'ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే' కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి ఓ పచ్చి అబద్ధం చెప్పారు. తనకు మనసు బాగోలేనప్పుడు విఆర్ హైస్కూల్‌కు వెళ్లి చిన్నపిల్లలతో ఆడుకొంటానన్నారు. కానీ ఇప్పటివరకు ఆయనెప్పుడూ ఆ పని చేసినట్లు నెల్లూరీయులెవరికీ తెలియక పోవడం విశేషం.

స్వర్ణభారత్‌లో ఉగాది ఉత్సవం

ఎప్పటి మాదిరిగానే ఈ యేడు కూడా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉగాది పండుగను ఘనంగా నిర్వహిస్తున్నారు. 3వ తేది కొండవీటి జ్యోతిర్మయి అన్నమయ్య సంకీర్తనాలాపనతో ఈ కార్యక్రమం మొదలవుతుంది. అనంతరం జరిగే కవితా గోష్టిలో పద్మశ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఆచార్య ముదిగొండ శివప్రసాద్, సుద్దాల ఆశోక్‌తేజ, అక్కిరాజు సుందర రామకృష్ణ పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రజ్యోతి దినపత్రిక మేనేజింగ్ డైరక్టర్ వేమూరి రాధాకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత డి.రామానాయుడు, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్, ఆదర్శ రైతు జి.ఎన్.రాజు యాదవ్‌లను సత్కరిస్తారు. పార్లమెంటు సభ్యులు వెంకయ్య నాయుడు అధ్యక్షతన ఈ కార్యక్రమాలన్నీ జరుగుతాయి.

ఇదేరోజు హైదరాబాద్ కేర్ హాస్పిటల్ సౌజన్యంతో చెవి, ముక్కు, గొంతు వైద్య శిబిరం జరుగుతుంది. దీనిలో ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ విష్ణుస్వరూప్ రెడ్డి, డాక్టర్ మురళి, డాక్టర్ జి.శ్రీనివాస్, డాక్టర్ డి.రాజు పాల్గొంటారు. కాక్లియాక్ ఇంప్లాంట్ సర్జరీ అవసరమైన చిన్నపిల్లలకు ఈ సర్జరీ కూడా చేయిస్తారు. ఈ రెండు కార్యక్రమాలకు నెల్లూరీయులను తరలి రమ్మంటున్నారు స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ ఐ.దీపా వెంకట్.

ప్లాస్టిక్ కవర్లపై సమరం

చాలారోజుల తర్వాత నెల్లూరు కార్పొరేషన్ ప్రజారోగ్య సిబ్బంది ప్లాస్టిక్ కవర్లపై యుద్ధం ప్రకటించారు. నగరంలో 40 మైక్రానుల కన్నా తక్కువ మందం గల కవర్లు వాడుకలో లేకుండా చూడాలని పెద్ద ఎత్తున షాపులపై దాడులు చేసి జరిమానాలు విధించారు. మళ్లీ కవర్లు వాడితే షాపుల లైసెన్సులు రద్దుచేస్తామని హెచ్చరించారు. ప్రతి చోట ప్లాస్టిక్ కవర్ల వినియోగం మూలంగా పర్యావరణానికి తీవ్ర విఘాతం ఏర్పడే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల్లో ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై జనాన్ని చైతన్యపరిచే కార్యక్రమాన్ని కార్పొరేషన్ రూపొందిస్తే బాగుంటుంది.

కార్పొరేషన్ బడ్జెట్

పాలకవర్గం లేకపోవడంతో కార్పొరేషన్ అధికారులే బడ్జెట్‌ను రూపొందించారు. 168 కోట్ల రూపాయల అంచనాలతో రూపొందించిన ఈ బడ్జెట్‌లో 157.62 కోట్లు ఖర్చు, 10.85 కోట్లు ముగింపు నిల్వగా చూపెట్టారు. కార్పొరేషన్‌కు వివిధ మార్గాల ద్వారా 139.76 కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని తేల్చి చెప్పారు.

రెండు దొంగతనాలు

బ్యాంకుల వద్ద డబ్బులు డ్రా చేసిన వారిని చూసి గమనించి దోపిడీ చేసే ముఠాలు నెల్లూరులో నిశ్శబ్దంగా తమ పని తాము చేస్తున్నాయి. 28వ తేది ఇస్కపల్లికి చెందిన వహాబ్ యాక్సిస్ బ్యాంకులో నాలుగు లక్షలు డ్రాచేసి ఎసి సెంటర్ దగ్గర కారు ఆపి సీటు క్రింద ఆ మొత్తం పెట్టి విత్తనాలు కొనుగోలు చేసి వచ్చే పది నిమిషాల్లోపే కారు అద్దాలు పగులగొట్టి మూడు లక్షల ఎనభైవేలు గుర్తు తెలియని వ్యక్తులు పట్టుకెళ్లారు.

ఇదే రోజు మద్రాస్ బస్టాండ్ వద్ద వుండే ఐసిఐసిఐ బ్యాంకు దగ్గర బ్రహ్మోస్ ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేసే ఐతా కృష్ణచైతన్య మూడున్నర లక్షల రూపాయలు డిపాజిట్ చేయను రాగా గుర్తు తెలియని వ్యక్తులు క్రిందడబ్బులు పడ్డాయంటూ చెప్పగా అతను వంగి చూసుకొంటుండగా బైకుపై పెట్టిన మొత్తంతో ఉడాయించారు. జనసంచారం ఉండేచోటే ఇటువంటి దోపిడీలు సంచలనం సృష్టిస్తున్నాయి. క్రైం పోలీసుల ఉదాసీనవైఖరిని ఎత్తి చూపుతున్నాయి.

ఫైర్ ఆఫీసును మార్చారు!

ఎన్నో ఏళ్లుగా నెల్లూరు రైల్వే ఫీడర్స్ రోడ్డులో వుండిన ఫైర్ ఆఫీసును మనుమసిద్ధి నగర్‌లోని ప్లాట్ నెం.19 లోని మొదటి అంతస్తులోనికి మార్చినట్లు అగ్నిమాపక అధికారి జి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

చిత్తూరు ఎమ్మెల్సీకి గొడవ

చిత్తూరు జిల్లా ఏర్పేడు మండలం ఆముదూరు ఎమ్మెల్సీకి చెంగారెడ్డి నెల్లూరు కోటమిట్టలోని విఘ్నేశ్వరపు

కొరవ 14వ పేజీలో

మానస సరోవర్, ముక్తినాథ్, మనోకామనా విమాన ప్రయాణం



20 రోజులు 6 యాత్రలు
1,20,000/- రూపాయలు మాత్రమే



: దర్శించు క్షేత్రములు :
1. లుంబిని 2. పోక్రా 3. ముక్తినాథ్ 4. మనోకామన 5. ఖాట్మండ్
6. మానస సరోవర్ (కైలాస పర్వత దర్శనం మరియు పరిక్రమణ)

హైదరాబాద్ నుండి ఖాట్మండ్
ఖాట్మండ్ నుండి హైదరాబాద్ విమాన ప్రయాణం
ఖాట్మండ్ నుండి మానస సరోవర్‌కు
ల్యాండ్‌క్రూయేజర్ జీపులో రోడ్ ప్రయాణం.

: వివరములకు సంప్రదించండి :
శ్రీ సాయి దుర్గా యాత్ర స్పెషల్
7-2-1087/A/63, రాజ రాజేశ్వరీ నగర్ కాలనీ, బి.కె.గూడ, హైదరాబాద్ - 500 038.
యన్.వి. చలపతి రావు - సెల్: 92462 66874

41st ANNIVERSARY
వార్షికోత్సవ ॐ కృతజ్ఞతాభివందనములు

మీ ఆదరాభిమానాలు పొందుతున్న మా గ్రూప్స్
◆ మురళీకృష్ణ 70 A.C. రెస్టారెంట్ (వెజ్ & నాన్‌వెజ్)
◆ మురళీకృష్ణ శాకాహార భోజనం కాఫీ, టిఫిన్ & ఐస్‌క్రీమ్స్
◆ మురళీకృష్ణ నేతిమిఠాయిలు
◆ మురళీకృష్ణ పిక్‌నిక్ ఐస్‌క్రీమ్స్
మద్రాస్ బస్టాండ్ దగ్గర, నెల్లూరు.
◆ మురళీకృష్ణ 70 A.C. ఫ్యామిలీ రెస్టారెంట్
◆ మురళీకృష్ణ 70 సెల్ఫ్ సర్వీస్ (వెజిటేరియన్)
◆ హోటల్ మురళీకృష్ణ 70 A.C. (లాడ్జి)
లీలామహల్ ప్రక్కన, నెల్లూరు.

మా "మురళీకృష్ణ" గ్రూప్స్ కస్టమర్ దేవుళ్ళ ఆదరాభిమానాలతో ఎప్పటికప్పుడు సరికొత్త రుచులతో నూతన ఒరవడికి శ్రీకారం చుడుతూ... నిత్య నూతనంగా 41 సం॥లు పూర్తి చేసుకొని 42వ సం॥లోనికి అడుగిడుతున్న శుభవేళ ఆత్మీయులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు ప్రత్యేకించి మా ఈ సుదీర్ఘ ప్రయాణంలో వెన్నంటి ప్రోత్సహిస్తున్న మా కస్టమర్ దేవుళ్ళకు
41వ వార్షికోత్సవ కృతజ్ఞతాభివందనములు.



ఎల్లప్పుడూ మీ ఆదరాభిమానములు కోరుకుంటూ....
మీ...
గ్రోసు గోపాలయ్య

సకుటుంబ సమేతంగా విచ్చేసి మా ఐటమ్స్‌ని ఆస్వాదించండి... ఆరగించండి... ఆనందించండి... మమ్ము ఆశీర్వదించండి!

మురళీకృష్ణ 70
గ్రూప్ ఆఫ్ హోటల్స్
మద్రాస్ బస్టాండ్ దగ్గర, నెల్లూరు.
లీలామహల్ ప్రక్కన, నెల్లూరు.
ఆహారమే ఆరోగ్యం - ఆరోగ్యమే ఆనందం - ఆనందమే ఐశ్వర్యం

మా ఖాతాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
15వ వార్షికోత్సవ మరియు ఖరనామ ఉగాది శుభాకాంక్షలు
"A" GRADE MARUTI AUTHORISED SERVICE STATION
MARUTI MOTORS
BORN TO SERVE
SUZUKI
Ph: 0861- 2318522, 2328522, 2330242
We under take company Ist, IInd, IIIrd free services with trained mechanics for all Maruti Vehicles.
Painting for Metallic Vehicles with100% Colour Matching Guarantee.
We are Authorised to under take Maruti Insurance
Shortly opening at Srinivasa Agraharam
MARUTI MARKETINGS
Distributors for Century plyboards
Lamination sheets, Imported wall care interior and exterior putty
Ph: 94402 78243
YOURS : MOHAN REDDY, SIVAN, SRINU & STAFF
OPP : G.P.R.GRAND KALYANAMANDAPAM,
MINI BY-PASS ROAD, RAMALINGAPURAM, NELLORE - 3.

బంగారం స్పెషల్ ఆఫర్
BIS 916 హాల్‌మార్క్ బంగారు ఆభరణములపై
సవరకు రూ.400/- తగ్గింపు.
గ్రాముకు రూ.50/- తగ్గింపు.
డైమండ్స్‌పై 10% తగ్గింపు.
గోల్డ్ ప్యాలెస్
హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీసు సెంటర్,
ఆచారివీధి, నెల్లూరు.
ఫోన్: 2331133, 2327611



అందుబాటులో కూరగాయలు... కొండెక్కిన కోడి మాంసం.

శాకాహారం క్రిందకు... మాంసాహారం పైపైకి!

గడచిన మాసం వరకు నిత్యావసర వస్తువులతోపాటు కూరగాయలు, నూనెల ధరలు ఆకాశాన్నంటాయి. విచిత్రంగా మాంసాహారమైన కోడి, పొట్టేలు మాంసం, చేపలు, రొయ్యల ధరలు కాస్త తగ్గుండినా ఇప్పుడీ పరిస్థితి మారింది. గత పక్షం రోజులుగా కూరగాయల ధరలు బాగా తగ్గి మాంసాహారం ధరలు ఒక్కసారిగా భగ్గుమంటున్నాయి. ఈ మాసం మొదలయ్యే నాటికి కిలో 130 రూపాయలమ్ముతుండిన స్కిన్‌లెస్ చికెన్ మాంసం గత దశాబ్దంలో ఎన్నడూలేని విధంగా 180 రూపాయలు ధర పలుకుతుంది. కిలో 360 రూపాయలకు అమ్ముతుండిన పొట్టేలు మాంసం 400 రూపాయలయ్యింది. చేపల్లో గండి, బొచ్చెల రకం కిలో 80 నుంచి వంద రూపాయలయ్యాయి. సన్నరకం రొయ్యలు సైతం కిలో 200 రూపాయలు పలుకుతున్నాయి.

ఫిబ్రవరి నెల చివరి వరకు కిలో 60 నుండి 70 రూపాయల వరకు అమ్మిన బీన్స్, క్యారట్, పందిరి చిక్కుళ్లు కిలో పది రూపాయలకు దిగాయి. టమోటా కిలో ధరైతే బాగా తగ్గి ఐదు రూపాలయ్యింది. వంకాయలు, బెండకాయలు, కాకరకాయలు, దోసకాయలు, పచ్చి మిర్చి కిలో పది రూపాయలకంటే తక్కువ ధరకు అమ్ముతున్నారు. 70 రూపాయలకు చేరి ఓ వణుకు వణికించిన ఎరగడ్డలు మార్కెట్‌లో కిలో ఎనిమిది రూపాయలకే దొరుకుతున్నాయి. తెల్ల గడ్డల ధర కూడా బాగా తగ్గింది. రైతులు మద్దతు ధరలేదని రోడ్లపై చేరి ఉద్యమాలు చేస్తున్న బియ్యం ధరలేమాత్రం తగ్గడం లేదు. మార్కెట్ ధరలు ఎక్కడం తగ్గడంలో పౌరసరఫరాల శాఖ ప్రమేయమే లేకుండా పోయింది.

అడుగడుగునా నిర్లక్ష్యం!



ప్రాణాలు బలిగొన్న రంగడి రథం.

తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. వారం రోజులపాటు జరిగిన ఈ ఉత్సవాల్లో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఈ బ్రహ్మోత్సవాల్లో అడుగడుగునా అధికారులు, పాలక మండలి వైఫల్యం కొట్టొచ్చినట్లు కన్పించింది. విశేష ప్రాచుర్యం గడించిన రథోత్సవంలో అపశృతి చోటుచేసుకొంది. కడప జిల్లాకు చెందిన యువకుడు రథచక్రాల క్రిందపడి మృతి చెందడం అందరినీ కలచి వేసింది. రథం వేగాన్ని నియంత్రించలేక పోవడంతో పాటు పోలీసుల వైఫల్యం స్పష్టంగా కన్పించింది. రథానికి ఇరువైపులా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలం కాగా, తగిన జాగ్రత్తలు తీసుకోవడంలో దేవస్థాన పాలక మండలి దారుణంగా వైఫల్యం చెందింది. దీనికితోడు రథచక్రాల తయారీలోనూ నాణ్యత లేకపోవడంపైనా విమర్శలు చెలరేగుతున్నాయి. 1994లో రంగడి రథోత్సవం సందర్భంగా రథచక్రాలు ఊడిపోయి ఆరుగురు మృతి చెందారు. ఆ రథం స్థానంలో కొత్తది రూపొందించినా అది కూడా కొద్ది కాలానికే మరమ్మత్తులకు గురైంది. మరోవైపు బ్రహ్మోత్సవాల చివరిరోజున నిర్వహించే తెప్పోత్సవానికి విశేష ప్రాధాన్యముంది. అలాంటి తెప్పోత్సవం జరిగిన రోజు నదిలో ఒక వ్యక్తి మరణించాడు. రంగనాథస్వామి తెప్పోత్సవం జరుగుతున్న సమయంలో ఆ ప్రాంతంలో శవం పడి వుండినా కూడా సంప్రోక్షణ చేయకుండా అలాగే కార్యక్రమాన్ని నిర్వహించడంపైనా పాలక మండలి విమర్శలు ఎదుర్కొంటున్నది. మొత్తంమీద అధికారులు, పాలక మండలి వైఫల్యం బ్రహ్మోత్సవాల్లో కొట్టొచ్చినట్లు కన్పించింది.

పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాల కరవు

టెన్త్ పరీక్ష వ్రాసే వారికి ఎన్ని కష్టాలో...



అర కొర వసతుల నడుమ పరీక్ష వ్రాస్తున్న విద్యార్థులు.

విద్యార్థుల భవిష్యత్తుకు కీలకంగా చెప్పబడే పదవ తరగతి పరీక్షలు నిజంగానే పిల్లల పాలిట అగ్ని పరీక్షలుగా మారాయి. ఏడాది పొడవునా ఎంతో శ్రమకోర్చి పరీక్షలకు సిద్ధమైన విద్యార్థులకు కనీస సౌకర్యాలు సమకూర్చడంలో విద్యాశాఖ పూర్తిగా విఫలమైంది. అధికారుల ఉదాసీనత, సిబ్బంది నిర్లక్ష్యం విద్యార్థుల పాలిట శాపంగా పరిణమించాయి. మార్చి 24న ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 606 ఉన్నత పాఠశాలల నుంచి 35, 828 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 180 పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. కాపీయింగ్‌ను అరికట్టేందుకు 16 స్క్వాడ్ బృందాలను నియమించారు. ఇవన్నీ చేసిన అధికారులు పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు కనీస సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించడంతో వారు తీవ్ర అసౌకర్యానికి గురికావాల్సి వచ్చింది. దీనికితోడు ఇరుకు గదులు, గాలి వెలుతురు సరిగా రాని చోట పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో విద్యార్థులు పడిన బాధలు వర్ణనాతీతం. అంతేకాక బోర్డుపై నెంబర్లు సరిగా వేయక పోవడం, పరీక్షా కేంద్రాల చిరునామాలు తెలియక పోవడంతో విద్యార్థులు ఒక దశలో ఒత్తిడికి గురయ్యారు. చివరకు త్రాగడానికి మంచి నీళ్లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో దప్పిక తీర్చుకొనేందుకు పిల్లలు పడిన బాధలు అన్నీఇన్నీ కావు. మరో వైపు కొన్ని కేంద్రాల్లో పరీక్ష పేపర్లు తారుమారు కావడం, ఆలస్యంగా ప్రశ్నాపత్రాలిచ్చి, ముందుగా తీసుకోవడంతో నష్టపోయామని విద్యార్థులు ఆందోళన చెందారు. పరీక్షలకు ముందు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నామని చెప్పిన విద్యాశాఖ అధికారులు పరీక్షల నిర్వహణలో ఘోరంగా వైఫల్యం చెందారు.

పర్యాటక కేంద్రాల అభివృద్ధికి రూ.23 కోట్లు!



సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ రాంగోపాల్.

జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం 23 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ రాంగోపాల్ చెప్పారు. జిల్లాలోని పర్యాటక కేంద్రాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై తన ఛాంబర్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. హెరిటేజ్ కారిడార్ ప్రాజెక్ట్ ద్వారా మంజూరైన నిధులను పెంచలకోనలోని లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం వద్ద సందర్శకులకు మౌలిక సదుపాయాలైన ఆడిటోరియం, టూరిజం కాంప్లెక్స్, మంచినీటి సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జొన్నవాడ కామాక్షితాయి ఆలయంలో రాత్రి సమయాల్లో భక్తులు బస చేసేందుకు గదులు నిర్మించాలన్నారు. రంగనాథస్వామి దేవాలయం వద్ద వాహనాల పార్కింగ్‌కు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు మినీ ఆడిటోరియం నిర్మించాలన్నారు. అద్దాల మండపాన్ని ఆధునీకరించాలన్నారు. పెన్నా బ్యారేజీ వద్ద బోటు షికారుకు బోట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఇరుగాళమ్మ గుడి వద్ద అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. నెల్లూరు పర్యాటక శాఖ సమాచార కేంద్రం, మినీ ఆడిటోరియం పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పర్యాటక అధికారి కె.నాగభూషణం, పంచాయితీరాజ్ ఎస్ఇ రామకోటారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

వడ్డీ రాయితీ ప్రకటించాక వసూళ్లు

పన్నుల వసూలుకు కార్పొరేషన్ పాట్లు



పన్ను వసూళ్లపై కమిషనర్ ఆంజనేయులు సమీక్ష.

ప్రభుత్వం ప్రజలకు ఏదో ఒక తాయిలమందించడం అలవాటు చేయడంతో ప్రజలు పన్నులు, అప్పులు కట్టను మారాం చేస్తున్నారు. దీంతో పలు ప్రభుత్వ సంస్థలు పీకల్లోతు ఇబ్బందుల్లో పడుతున్నాయి. నెల్లూరు కార్పొరేషన్‌కు పదిహేడు కోట్ల రూపాయల పైబడి ఆస్తి పన్ను వసూలు కావాలి. పాత బకాయిలున్న వారు ప్రభుత్వం వడ్డీ రాయితీ ప్రకటిస్తే కడతామని హఠం పట్టి కూర్చొన్నారు. మార్చి నెల చివరి వారంలో మొత్తానికి ఈ రాయితీ ప్రకటించడంతో ఐదు రోజుల వ్యవధిలో రెండు కోట్ల రూపాయల పైబడి ఆస్తి పన్ను వసూలయ్యింది. దీనికితోడు కార్పొరేషన్ ఖజానా ఖాళీ కావడంతో కమిషనర్ ఆంజనేయులు, డిప్యూటీ కమిషనర్ భాగ్యలక్ష్మి నగరంలో పన్ను వసూళ్లకు 38 ప్రత్యేక బృందాలు, 12 వాహనాలు ఏర్పాటు చేశారు. కార్పొరేషన్ సిబ్బంది నగరంలోని వివిధ ప్రాంతాలలో ప్రచారం నిర్వహిస్తూ ఇళ్ల వద్దే పన్నులు వసూలు చేస్తుండడంతో జనం డబ్బులు కట్టేస్తున్నారు. ఈ – సేవా కేంద్రాల్లోనూ వడ్డీ రాయితీతో పన్నులు కట్టవచ్చు. ఇళ్ల వద్ద పన్నుల చెల్లింపుల్లో బిల్లు కలెక్టర్లు మతలబు చేయకుండా ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తే ప్రజల సొమ్ము బిల్లు కలెక్టర్ల పాలు కాదు.

రెవెన్యూ మెడకు సెజ్‌ల పరిహారం ఉచ్చు!

ఎవరు చేసిన పాపం వారు అనుభవించక తప్పదన్నట్లు ఆర్థిక మండళ్ల ఏర్పాటు కోసం సేకరించిన భూముల పరిహారం పంపిణీలో రెవెన్యూ శాఖ చేసిన తప్పులన్నీ ఎసిబి విచారణలో బయటపడుతున్నాయి.

జిల్లావ్యాప్తంగా ప్రత్యేక ఆర్థిక మండళ్ల ఏర్పాటు కోసం సేకరించిన భూములు, పరిహారం పంపిణీలో అక్రమాలకు పాల్పడిన రెవెన్యూ సిబ్బందిపై చర్యలు చేపట్టే అవకాశం వుంది. గత సంవత్సరం నుంచి ఆర్థిక మండళ్ల కోసం రైతుల నుంచి సేకరించిన భూములలో అక్రమాలు జరగడంపై అనినీతి నిరోధకశాఖ దర్యాప్తు చేస్తున్నది. ఎసిబి చేపట్టిన దర్యాప్తుకు ప్రాథమికంగానే రాజకీయ అవరోధాలు ఏర్పాడ్డాయి. దీంతో కొన్ని నెలలపాటు విచారణ మరుగున పడిపోయింది. రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ పార్టీలు, సంఘాల నేతలు పదేపదే ఫిర్యాదులు పంపడంతో తిరిగి విచారణ ప్రారంభమైంది.

పట్టా భూములు, అసైన్‌మెంట్ భూములు, సిజెఎఫ్‌ఎస్ భూములు పరిశ్రమల ఏర్పాటు కోసం సేకరించడం జరిగింది. గూడూరు డివిజన్‌లోని చిల్లకూరు మండలంలో అనేకమంది రైతులు నేటికీ తమ భూములకు పరిహారం అందక రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే వున్నారు. ఒకరి పేరుతో వున్న అసైన్‌మెంటు, సిజెఎఫ్‌ఎస్ భూములకు మరొకరి పేరుతో దృవీకరణ పత్రాలను రెవెన్యూ అధికారులు జారీ చేశారన్న ఆరోపణలు వున్నాయి. ఇంతకు ముందు గూడూరు రెవెన్యూ డివిజన్‌లో అధికారిగా పనిచేసి వెళ్లిన రామచంద్రారెడ్డి పరిశ్రమలకు సంబంధించిన భూముల విషయాల్లో కీలకపాత్ర పోషించారు. తొలి దశలో ఎసిబి అధికారులు చేపట్టిన విచారణలో ఈయనపై క్రిమినల్ కేసు కూడా నమోదు చేశారు.

గ్రామ రెవెన్యూ అధికారి దగ్గర నుంచి ఆర్డీఓ వరకు భూముల పరిహారం పంపిణీలో పలు అక్రమాలకు పాల్పడినట్లు ఎసిబి దర్యాప్తులో తేలింది. అనేకమంది చిన్న, సన్నకారు రైతులు ఎసిబి విచారణకు హాజరై జరిగిన అన్యాయంపై వ్రాత పూర్వకంగా విన్నవించారు. రాజకీయ జోక్యం కారణంగా రెవెన్యూ సిబ్బంది, అధికారులు పరిహారం పంపిణీలో చేతివాటం ప్రదర్శించారు. భూములకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను తారుమారు చేయడంతోపాటు కొందరు నకిలీ పరిహారం చెక్కులు పొందేందుకు సహకరించారు. నిలిచిపోయిందని భావించిన ఎసిబి విచారణ పునఃప్రారంభించడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

నెల్లూరు డివిజన్‌లో ముత్తుకూరు, తోటపల్లి గూడూరు మండలాల్లో వేలాది ఎకరాల భూములు వివిధ పరిశ్రమల కోసం తీసుకుంది ప్రభుత్వం. పట్టా భూములకు సంబంధించి పెద్దగా ఆరోపణలు లేకపోయినా అసైన్‌మెంట్, సిజెఎఫ్‌ఎస్ భూముల పరిహారంలో గందరగోళం నెలకొని వుంది. కొంతమంది దళారులు ప్రవేశించి రెవెన్యూ సిబ్బందితో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని రైతులకు తీరని అన్యాయం చేశారు. గతంలో టిపి.గూడూరు, ముత్తుకూరు తహశీల్దార్లుగా పనిచేసిన వారితోపాటు బదలీపై వెళ్లిన ఆర్డీఓ వెంకటరమణారెడ్డి సైతం భూములపై హక్కు కలిగిన రైతులకు న్యాయం చేయలేక పోయారు.

పరిశ్రమల ప్రతినిధులతో కుమ్మక్కై రైతులకు తక్కువ పరిహారం అందించారు. మరో ప్రక్క రాజకీయ దళారుల నుంచి భారీ మొత్తంలో సొమ్ము వసూలు చేశారన్న అభియోగాలున్నాయి. గతవారంలో ఎసిబి అధికారులు, నెల్లూరు, గూడూరులో నిర్వహించిన విచారణలో అధికారులపై మరిన్ని అవినీతి ఆరోపణలు వచ్చాయి. బాధ్యులపై నేరుగా చర్యలు తీసుకొనే అధికారం ఎసిబి అధికారులకు లేకపోవడంతో



మేనకూరు గ్రామం వద్ద కపారో సంస్థకు కేటాయించిన వ్యవసాయ భూమి.

కేవలం ప్రభుత్వానికి నివేదికలు పంపేందుకే పరిమితం కావాల్సి వచ్చింది. ప్రభుత్వం నుంచి సంబంధితశాఖలకు బాధ్యులపై చర్యలు తీసుకొనేందుకు ఆదేశాలు వెళ్లడం ఇప్పటివరకు జరగలేదు. మొత్తం మీద ఎసిబి విచారణ జరగడంపై ప్రతిపక్ష పార్టీల నేతలు, రైతులు శుభపరిణామంగా భావిస్తున్నారు.

అవినీతి ఆరోపణలు వచ్చిన అధికారులకు మరోసారి ఎసిబి అధికారులు నోటీసులు జారీచేసే అవకాశం వుంది. రెవెన్యూ రికార్డులను సైతం సక్రమంగా పరిశీలించి లోటుపాట్లను గుర్తిస్తున్నారు. అవసరమైతే తహశీల్దార్ కార్యాలయాల నుంచి రికార్డులను స్వాధీనం చేసుకొంటున్నారు. నగదు చెక్కులను జమ చేసిన బ్యాంకుల నుంచి రైతుల వివరాలు, ఫోటోలను సేకరించే పనిలో నిమగ్నమై వున్నారు. ఎసిబి విచారణ ఎవరి మెడకు చుట్టుకొంటుందోనని రెవెన్యూ వర్గాల్లో భయాందోళన నెలకొంది.

మండలాలకు నిధులు మంజూరు!

సిఎం మదిలో మెదలిన సరికొత్త పథకమిది.

రాష్ట్ర ప్రభుత్వం మండలపరిషత్‌లకు నిధులు విడుదల చేయనుంది. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశాలలో ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకొన్నారు. గతంలో దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అన్ని మండలాలకు 2009 ఎన్నికలకు ముందు 50లక్షల రూపాయల మేర నిధులు విడుదల చేయడం జరిగింది. ఇదే తరహాలో ప్రస్తుత ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి ఒక్కో మండలానికి 10లక్షల రూపాయల వరకు విడుదల చేసేందుకు అంగీకరించారు. మండల పరిషత్‌లకు విడుదలయ్యే నిధులను గ్రామీణ ప్రాంతాల రోడ్ల నిర్మాణం, తాగునీటి అవసరాల కోసం వినియోగిస్తారు.

గతంలో మంజూరైన 90లక్షల నిధులను పనుల పేరుతో అధికారపార్టీకి చెందిన నేతలు వారి అనుచరులు హస్తగతం చేసుకొన్నారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అధికారులు కూడా ఏమీ చేయలేక పోయారు. మూడు సంవత్సరాల విరామం తర్వాత రాష్ట్రప్రభుత్వం నుంచి మండలపరిషత్‌కు నిధులు మంజూరు చేస్తుండడంతో వీటిని కూడా అధికారపార్టీకి చెందిన నేతలు ఏదో ఒక పని పేరుతో చేజిక్కించుకోవాలన్న ప్రయత్నాలు సాగిస్తున్నారు. ప్రభుత్వం ఈ దఫా విడుదల చేసే నిధుల్ని వినియోగించే అధికారం మండలపరిషత్ అధికారులకు అప్పగించింది.

మండలస్థాయిలో అధికారపార్టీకి చెందిన నేతలకు లబ్ధి చేకూర్చి పెట్టేందుకే ముఖ్యమంత్రి 10లక్షల రూపాయలు విడుదల చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సంక్షోభంలో పడిన తర్వాత జిల్లాలో పరిపాలన పూర్తిగా స్తంభించిపోయింది. మరోప్రక్క ఆర్థిక పరిస్థితి కారణంగా మండలస్థాయిలో ఆశించిన మేర పనులు కూడా జరగడం లేదు. ఇటువంటి పరిస్థితులో ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో మండలాలకు నిధులు విడుదల చేసేందుకు నిర్ణయం తీసుకోవడంతో మండలస్థాయి నేతల్లో సంతోషం వ్యక్తమవుతుంది. ప్రస్తుతం మండలాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులు మాత్రం చేస్తున్నారు.

ఈ పనులు నత్తనడకన సాగుతుండడం ఇందులో నేతలకు వాటాలు దక్కకుండా పోతున్నాయి. కాంట్రాక్టు పనులు దక్కించుకుంటే అధిక మొత్తంలో ఆదాయం వుంటుందన్న వుద్దేశంతో నిధుల కోసం ఎంతో ఆశతో ఎదురు చేస్తున్నారు. పంచాయితీరాజ్ ఇంజినీర్లను సంప్రదించి మండలంలో పనులు చేపట్టే గ్రామాల వివరాలు, ప్రతిపాదనల గురించి ముందుగానే సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. అధికారపార్టీ ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాలతోపాటు తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల సిఫార్సుతో పనులు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఆర్థిక సంవత్సరం చివరిలో రాష్ట్రముఖ్యమంత్రి మండలాలకు 10లక్షల రూపాయల నిధులు మంజూరు చేయడం విశేషం. ప్రభుత్వం విడుదల చేసే నిధులు దుర్వినియోగం కాకుండా ప్రజలకు వుపయోగపడే పనులు కోసం ఖర్చు చేస్తే బాగుంటుంది.



వాకాటి నారాయణరెడ్డి ఎమ్మెల్సీగా ఎన్నికైన శుభసందర్భాన్ని పురస్కరించుకొని ఇందిరాభవన్ వద్ద స్వీట్లు పంచుతున్న బాలసుధాకర్, ఉడతా వెంకట్రావ్, రఘు తదితరులు.



నెల్లూరు వేద సంస్కృత పాఠశాలలో ఒక విద్యార్థికి బదులుగా మరో విద్యార్థి టెన్త్ పరీక్ష వ్రాస్తుండగా పట్టుకొన్న వన్‌టౌన్ కానిస్టేబుల్ దేవ కిరణ్‌ను అభినందిస్తున్న ఎస్పీ దామోదర్. ప్రక్కన వన్‌టౌన్ ఎస్‌ఐ నరసింహారెడ్డి.

విత్తన శుద్ధితో తెగుళ్లు తగ్గుతాయి!

● వ్యవసాయశాఖ సంచాలకుడు

రైతులు విత్తన శుద్ధి చేయడం వలన వాటి ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్లను నివారించవచ్చని వ్యవసాయ శాఖ సంచాలకులు జడ్.వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. వెంకటగిరి పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో జరిగిన రైతు శిక్షణా తరగతుల్లో నెల్లూరు రైతు శిక్షణా కేంద్రం సహాయ సంచాలకులు సత్యవాణితో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రైతులకు, మహిళలకు పలు సూచనలు చేశారు. పంటలకు తెగుళ్లు సోకిన తర్వాత వాటి నివారణకు చర్యలు చేపట్టడం కంటే ముందుగానే విత్తనాలను శుద్ధి చేయడం వలన తెగుళ్లు ఆశించకుండా నివారించడం తోపాటు పంట దిగుబడి పెరిగి లాభాలు పొందే అవకాశం వుంటుందన్నారు. అలాగే భూసార పరీక్షలు చేయించుకోవడం అవసరం అన్నారు. దీని వలన ఎరువుల వినియోగాన్ని, అనవసరపు ఖర్చును తగ్గించుకోవచ్చన్నారు. మహిళలు వ్యవసాయ రంగంలో మెలకువలు పాటించడం ద్వారా పండించిన పంటకు మరింతగా లాభాలు ఆర్జించవచ్చన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో వెంకటగిరి, బాలాయపల్లి మండల వ్యవసాయాధికారులు గిరీష్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

● అల్లూరుపేటలో

పార్కు అభివృద్ధి చేస్తా!

ఎమ్మెల్యే బీద భరోసా

అల్లూరుపేటలో గల కస్తూరిదేవి పార్కు వైభవానికి తనవంతు కృషి చేస్తానని కావలి శాసన సభ్యుడు బీద మస్తాన్‌రావు హామీ ఇచ్చారు. రామకృష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థులు పార్కులోని చెత్తను తొలగించి శుభ్రపరచే కార్యక్రమాన్ని చేపట్టారు. పార్కును పరిశీలించేందుకు వచ్చిన ఆయన పార్కు దుస్థితిపై స్పందిస్తూ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు. విద్యా సంస్థల కరస్పాండెంట్ అల్లంపాటి విజయవర్ధన్‌రెడ్డి తోపాటు తాను 25వేల రూపాయలు పార్కు అభివృద్ధికి సహాయం చేశానన్నారు. మరికొంత మొత్తాన్ని ఇందుకోసం వెచ్చించనున్నట్లు మస్తాన్‌రావు తెలిపారు. పార్కు బాగుకోసం విద్యార్థులు చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు.

కృష్ణపట్నం పోర్టు అభివృద్ధి చేస్తున్నాం!

కృష్ణపట్నం పోర్టును అన్ని విధాలా తీర్చిదిద్దుతున్నట్లు పోర్టు సిఇఓ అనిల్‌కుమార్ తెలిపారు. సెప్టెంబర్ మాసం నాటికి 1.80 లక్షల టన్నుల బరువు కల్గిన ఫుల్‌కాప్ నౌక లంగరు వేసే స్థాయిలో అభివృద్ధి పరుస్తున్నామన్నారు. ఈ నౌక లంగర్ వేయాలంటే బెర్తుల వద్ద 18 మీటర్ల లోతు వుండాలన్నారు. అందుకోసం డ్రెడ్జింగ్ పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే 16.5 మీటర్ల వరకు లోతు పెంచామని, దీని వలన 1.4లక్షల టన్నుల సరకుతో వచ్చిన నౌకలు లంగరు వేస్తున్నా

సిఇఓ అనిల్‌కుమార్ వెల్లడి

యన్నారు. ఈ సౌకర్యం గంగవరం, కృష్ణపట్నం పోర్టులో మాత్రమే వుందన్నారు. ప్రస్తుతం వున్న 8 బెర్తులే కాకుండా మరో 3 బెర్తులు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఓడరేవు ద్వారా ఏటా 600కోట్ల కస్టమ్స్ డ్యూటీ చెల్లింపు జరుగుతున్నాదన్నారు. వెంకటాచలం నుంచి పోర్టు వరకు 20 కిలోమీటర్ల మేర నిర్మాణం అయిన రైలు మార్గం ద్వారా రైల్వేశాఖకు 100 కోట్లు ఆదాయం లభిస్తోందన్నారు. పోర్టును అన్ని విధాలా అభివృద్ధి పరచేందుకు యాజమాన్యం తగిన కృషి చేస్తున్నదని చెప్పారు.

పాల దిగుబడి పెరుగుతుందిలా...

కృత్రిమ గర్భధారణ తప్పనిసరి!

కృత్రిమ గర్భధారణతో మేలు జాతి పశువులలో పాల దిగుబడి అధికంగా పెంచవచ్చని పొదలకూరు మండల పశుసంవర్ధక అధికారి మాలకొండయ్య సూచించారు. తోటపల్లి గూడూరు మండల పరిషత్ కేంద్రంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో మాట్లాడారు. ఎద లక్షణాలను గుర్తించి కృత్రిమ గర్భోత్పత్తి ద్వారా పశువులకు గర్భధారణ చేయించడం అవసరమన్నారు. గ్రామాల్లో పశు పెంపకందారులు పాత విధానాలను అవలంభిస్తున్నారని దీనివల్ల మేలైన పశువుల జాతి లభించడంలేదన్నారు. ఎంపిడిఓ పముజుల సుజాతమ్మ మాట్లాడుతూ పశుక్రాంతి పథకం కింద అందించిన గేదెలను అమ్మకోవద్దని రైతులకు సూచించారు. పాడి పరిశ్రమ కుటుంబ పరిశ్రమ అని, పాడిపై ఆధారపడి సామాన్య కుటుంబాలు కుటుంబ పోషణ జరుపుకొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖాధికారులు వసంతరాయలు, జయప్రకాష్, అహ్మద్‌బాషా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మూతబడ్డ భూసార పరీక్షా కేంద్రం

కావలి రూరల్ మండలం మద్దూరుపాడు వ్యవసాయ మార్కెట్ కమిటి యార్డు ఆవరణలో గల భూసార పరీక్షా కేంద్రం మూతపడింది. భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు తగిన సూచనలు సలహాలు అందివ్వడం ఈ కేంద్రం ఏర్పాటులో ముఖ్య ఉద్దేశం. ఎంత మోతాదులో ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడాలి, అధిక దిగుబడులు ఎలా సాధించాలనేదానికి ముందుగా భూసార పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయి రైతాంగానికి. దగదర్తి, కావలి మండలాలతో

నానాపాట్లు పడుతున్న రైతులు

పాటు బోగోలు, జలదంకి, కలిగిరి, కొండాపురం మండలాలలోని రైతాంగానికి తగిన సలహాలు సూచనలు అందించేందుకు గాను 1999లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీని బాగోగులు పట్టించుకోకపోవడం, సిబ్బంది గైర్హాజరవుతున్నా ఉన్నతాధికారులు స్పందించకపోవడంతో గత ఏడాది కాలంగా రైతులకు ఉపయోగపడకుండా వుంది. రైతులు కార్యాలయం చుట్టూ తిరిగిపోతున్నా దీనిని తెరచిన దాఖలాలు లేవు. సంబంధిత శాఖాధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ధాన్యం కొనుగోలు కేంద్రం!

తీరిన తోటపల్లిగూడూరు వాసుల కోరిక

ఇందిర క్రాంతి పథకం ఆధ్వర్యంలో తోటపల్లిగూడూరు మండలం సాలిపేట సహకార సంఘం గోడౌన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటయ్యింది. ఈ సందర్భంగా ఇందిరక్రాంతి పథకం ఎడిఎం కృష్ణవేణి మాట్లాడుతూ రైతులకు ఈ కేంద్రంపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కేంద్రం ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. సాలిపేటలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం కొంత దూరమైనప్పటికీ రైతులకు ఇబ్బంది కలుగకుండా వుండేందుకు సహకార సంఘం అధ్యక్షుడు చినబాబిరెడ్డి, ఎపిఎం కృష్ణవేణిలు తగిన చర్యలు చేపట్టి ప్రజల నుంచి మన్ననలు అందుకొంటున్నారు.

మద్యం వ్యాపారుల ఇష్టారాజ్యం

పట్టించుకోని ఎక్సైజ్‌శాఖ

బోగోలు మండలంలో మద్యం షాపుల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధిక ధరలకు మద్యాన్ని విక్రయించడంతోపాటు వేళలు పాటించకుండా అమ్మకాలు సాగిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గాంధీ జయంతి తదితర సెలవు దినాల్లో మద్యం షాపులు తెరవకూడదు. కానీ ఈ నిబంధనలు షాపుల యాజమాన్యాలు పాటించడం లేదు. తాళాలు వేసి వున్నప్పటికీ మద్యం మాత్రం విచ్చలవిడిగా దొరుకుతోంది. సాధారణరోజుల్లో కంటే అధిక ధరలకు వీటిని అమ్మి జేబులు నింపుకొంటున్నా ఎక్సైజ్ అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మద్యం షాపుల నుంచి అధిక మొత్తంలో నెలనెలా అందుతున్న ముడుపులు కారణంగానే వాటి వైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి. బోగోలు, అల్లూరు, దగ్గదర్తి, కావలి, మండలాల్లోనూ ఇదే తంతు. ఇప్పటికైనా అధికారులు లంచాల మత్తు వదిలించుకొని కఠినంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు.

• అటకెక్కిన

మొక్కల పెంపక పథకం

సర్వేపల్లి నియోజకవర్గంలో గాంధీజయంతి సందర్భంగా చేపట్టిన మొక్కల పెంపకం పథకం అటకెక్కింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ అభివృద్ధి పథకంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని గత ఏడాది అక్టోబర్ 2న అట్టహాసంగా చేపట్టారు. నియోజకవర్గ పరిధిలో 11చోట్ల నర్సరీల ద్వారా మొక్కల పెంపకాన్ని అటు ఉద్యానవన, ఇటు అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా చేపట్టినా అది కార్యరూపం దాల్చలేకపోయింది. కానుగ, ఎర్రచందనం, టేకు, వెదురు, కరివేపాకు, సుబాబుల్, ఇప్ప, ఉసిరి వంటి వివిధ జాతుల పర్యావరణాన్ని పరిరక్షించే మొక్కలను పెంచడం ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం. తోటపల్లిగూడూరు మండలంలోని కొత్తపాళెం, ముత్తుకూరు మండలంలోని బ్రహ్మదేవి, ముసునూరివారి పాళెం,

సర్వేపల్లిలో ఆరంభ శూరత్వం

మనుబోలు మండలంలోని మనుబోలు, వడ్లపూడి, వెంకటాచలం మండలంలోని తిక్కవరప్పాడు, వెంకటాచలం, పొదలకూరు మండలంలోని ప్రభగిరిపట్నం, ఇంకుర్తి, తోడేరు, మొగళ్లూరు గ్రామాలను ఎంపిక చేశారు. ఒక్కో కేంద్రంలో లక్ష మొక్కలను పెంచి వాటిని రైతుల కందించాలన్న సంకల్పం చతికిలబడింది. పై మండలాల్లో ఎక్కడా ఆ ఊసే లేదు. స్థానిక శాసన సభ్యుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈ మొక్కల పెంపకాన్ని ప్రారంభించినా అది ఆరంభ శూరత్వం అయ్యింది. ఎంపిడిఓల ఆధ్వర్యంలో సామాజిక వనవిభాగం అధికారులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాల్సి వుండగా ఆయా శాఖల మధ్య సమన్వయ లోపంతో వైఫల్యం చెందింది.



కడపలోని హరిత ఆడిటోరియంలో జరిగిన మల్లెమాల సాహిత్య పురస్కార సభలో కవి పి.రామకృష్ణకు అవార్డు బహుకరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సివి.నాగార్జునరెడ్డి, నెల్లూరీయుడు మాల్లెమాల వేణగోపాలరెడ్డి.



నెల్లూరు మోడరన్ స్కూల్ విద్యార్థులు పోలియో నిర్మూలనకు సేకరించిన విరాళాన్ని రోటరీ క్లబ్ అధ్యక్షుడు రాఘవేంద్ర షెట్టికి అందిస్తున్న దృశ్యం. చిత్రంలో స్కూల్ కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్‌రెడ్డి వున్నారు.


పేరుకపోయిన శిస్తు బకాయిలు

తోటపల్లి గూడూరు మండలంలో నీటితీరువా శిస్తు బకాయిలు 3కోట్ల రూపాయల మేర పేరుకపోయాయి. భూస్వాములు శిస్తు కట్టాలన్న విషయమే మరచిపోవడం, చిన్న రైతులు కాస్తో కూస్తో చెల్లిస్తుండడంతో కోట్ల రూపాయల బకాయిలు పేరుకపోయాయి. మండలంలో 1406 ఫసలీ నుంచి 1420 వరకు ఈ బకాయిలు వున్నాయి. గతంలో కరణాలు, మునసబులు వున్న కాలంలో ఈ శిస్తును వసూలు చేసి ఖజనాకు జమ చేసేవారు. ఇప్పుడు రెవెన్యూ కార్యదర్శుల హయాం రావడంతో శిస్తు వసూళ్లు సక్రమంగా జరగడం లేదు. పేరుకపోయిన పాత బకాయిలు వసూలు చేయాలంటే తహశీల్దార్లకు తలకు మించిన భారమౌతోంది. రెవెన్యూ కార్యదర్శులకు రైతులతో సన్నిహిత సంబంధాలు లేక పోవడం,

తోటపల్లిగూడూరులో రూ.3కోట్ల మేర రావాల్సి వుంది

ఇతరత్రా కారణాల వలన శిస్తు వసూళ్లు చేయ లేకపోతున్నారు. మండలంలో 13 రెవెన్యూ గ్రామాలలో ప్రతి ఏడాది 20వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. నీటి తీరువా క్రింద మొదటి పంటకు 200, రెండో పంటకు 50 రూపాయల చొప్పున చెల్లించాల్సి వుంటుంది. ఇప్పటి వరకు 3కోట్ల బకాయిల్లో స్వల్పమొత్తాన్ని కూడా వసూలు చేయలేని పరిస్థితి. మరోవైపు కొందరు సిబ్బంది చేతి వాటం చూపి డూప్లికేట్ రశీదులతో కొంత మొత్తం స్వాహా చేశారట. ఈదూరు, మండపం, కోడూరు గ్రామాల్లో ఇలాంటివి జరిగినట్లు సమాచారం. శిస్తు వసూలు సొమ్ము డిస్ట్రిబ్యూటరీ సంఘాలు, పంచాయితీలకు కేటాయించాల్సి వుండగా అది నిలచిపోవడంతో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిబంధకంగా మారింది.

పుణ్య సంస్మరణ



స్వర్గీయ శ్రీ సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి

మాన్యుడు, మరపురాని నేత

శ్రీ సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి గారు

కీర్తిశేషులై ఏప్రిల్ 6వ తేదికి
28 సంవత్సరములు నిండుతాయి.
ఈ సందర్భంగా ఆ పుణ్యమూర్తిని స్మరిస్తూ...
వారి పవిత్రాత్మకు భక్త్యంజలి ఘటిస్తున్నాము.


భార్య : **సోమిరెడ్డి హైమావతమ్మ**

కుమారులు : **సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**
లేట్ **సోమిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి**

కుమార్తెలు : **కట్టంరెడ్డి సంయుక్త**
కేతిరెడ్డి ఉష


మనుమలు : **సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి**
సోమిరెడ్డి అర్జున్

మరియు **కుటుంబ సభ్యులు**




సురేష్‌రెడ్డి కోసం కిరణ్ పైరవీ

తనకు అత్యంత సన్నిహితుడైన మాజీ స్పీకర్ సురేష్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఇప్పించడానికి సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డి పైరవీ చేస్తున్నాడు. ఇటీవల ఢిల్లీ పర్యటనలో కిరణ్ దీనిపైనే దృష్టి పెట్టాడట. గవర్నర్ నామినేట్ చేయాల్సిన ఎమ్మెల్సీల్లో ఒకటి సురేష్‌రెడ్డికి కేటాయించాలంటూ సోనియాను అభ్యర్థించాడట కిరణ్. ప్రస్తుత మంత్రివర్గంలో తనకు నమ్మకమైన వారు ఎవరూ లేకపోవడంతో ఇబ్బందిగా వుందని కిరణ్ మొత్తుకున్నాడట. సురేష్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఇప్పించుకొని మంత్రివర్గంలోకి తీసుకొంటే తనకు కొంత మద్దతు దొరుకుతుందని కిరణ్ వివరణ ఇచ్చాడట. అయితే సోనియా మాత్రం ఈ విషయంలో మౌనంగా వున్నట్లు అభిజ్ఞవర్గాల భోగట్టా. గతంలో వైఎస్ కూడా తన మిత్రుడు కెవిపికి రాజ్యసభ ఇప్పించుకోడానికి ఇలానే పైరవీ చేశాడు. అయితే చాలాకాలం తర్వాతగానీ సోనియమ్మ కరుణించలేదు. సురేష్‌రెడ్డి విషయంలో కూడా సోనియమ్మ ఓపట్టాన తలూపే అవకాశం లేదని గాంధీభవన్ వర్గాలు చెవులు కొరుక్కుంటున్నాయి. తన మిత్రుడి ఎమ్మెల్సీ కోసం కిరణ్ మరికొంత కాలం ఆగక తప్పదేమో!



ప్రక్షాళన పర్వంలో సిఎం

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగియడంతో సిఎం కిరణ్‌కుమార్ పరిపాలనపై పట్టుసాధించే దిశగా ప్రక్షాళనకు శ్రీకారం చుట్టబోతున్నాడట. ముందుగా తన పేషీలో స్వల్ప మార్పు చేర్పులు చేయాలనుకుంటున్నాడు. ఇప్పటికే తన పేషీపై విమర్శలు ఎక్కువ కావడాన్ని కిరణ్ కాస్తంత సీరియస్‌గానే తీసుకుంటున్నాడు. ముఖ్య కార్యదర్శి జె.సత్యనారాయణ పనితీరు మరీ తాబేలు నడకను తలపిస్తుండటం కిరణ్‌కు తలనొప్పిగా మారింది. అలాగే కార్యదర్శి జవహర్‌రెడ్డి ఈ మధ్య వైఎస్ వర్గంతో క్లోజ్‌గా వుంటున్నాడట. దీంతో జవహర్‌ను తప్పించి మరో రెడ్డి ఐఎఎస్‌ను పేషీలో చేర్చుకోవాలనుకుంటున్నాడు. అయితే ఐఎఎస్ అధికారుల్లో పెరిగిపోతున్న అవినీతి, అలసత్వం, లెక్కలేనితనం ప్రభుత్వ ఇమేజ్‌ను దెబ్బ తీస్తోందన్న సంగతిని కిరణ్ గుర్తించాడట. అందుకే ఏప్రిల్ మొదటివారంలో భారీ ఎత్తున ఐఎఎస్ అధికారుల బదిలీలకు శ్రీకారం చుట్టబోతున్నాడు. ఇందులో దాదాపు 15మంది జిల్లా కలెక్టర్లకు బదిలీ వేటు తప్పదంటున్నారు. పాలనా యంత్రాంగం ప్రక్షాళన తర్వాతనే మంత్రివర్గ మార్పులపై దృష్టిపెడ్తాడట. కిరణ్ మార్కు ప్రక్షాళన ఎలా వుంటుందోనని సచివాలయ వర్గాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి.




సిఎం జిల్లా అయితే ఏం గొప్పా!

సొంత జిల్లా చిత్తూరుకు సిఎం కిరణ్ ఏకంగా బడ్జెట్‌లో 50కోట్ల రూపాయల్ని ప్రత్యేక పద్దుగా కేటాయించుకోవడం విమర్శలకు గురవుతోంది. సిఎం జిల్లా అయితే ఏంటట? మావి మాత్రం జిల్లాలు కావా? మాకు అవసరం లేదా? అంటూ కొందరు మంత్రులు బహిరంగంగానే పెదవి విరుస్తున్నారు. కేవలం బడ్జెట్ కేటాయింపులు మాత్రమే గాకుండా ఆయాశాఖలు పోటీపడి మరీ నిధుల్ని కేటాయిస్తుండటం పట్ల కూడా మంత్రులు తీవ్ర ఆక్షేపణ తెలుపుతున్నారు. మార్కెటింగ్‌శాఖ ఇప్పటికే కోట్లాది రూపాయల పనుల్ని చిత్తూరుజిల్లాలో మొదలుపెట్టింది. ఇద్దరు ఇంజనీర్లను ప్రత్యేకంగా ఈ పనుల కోసమే నియమించడం చర్చనీయాంశం అయింది. అలాగే ఆర్‌అండ్‌బి, వ్యవసాయ, పరిశ్రమలు, సెరీకల్చర్, ఇరిగేషన్ వంటిశాఖల అధికారులు పోటీపడి మరీ చిత్తూరుజిల్లాకు నిధులు కేటాయిస్తున్నారు. సిఎం మెప్పు పొందడానికి ఇదే మంచి అవకాశమంటూ అధికారులు పడుతున్న తపన చూస్తూంటే చిత్తూరుజిల్లా త్వరలో కడప జిల్లాను మించేట్లుందని సచివాలయ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. వై.ఎస్ సిఎంగా వున్నప్పుడు కూడా వందలకోట్ల రూపాయల్ని కడపజిల్లాకు, ముఖ్యంగా పులివెందుల అభివృద్ధికి కేటాయించడాన్ని వారు గుర్తుచేసుకుంటున్నారు.

సిఎంకు కెసిఆర్ చేయూత!



శాసనసభ సజావుగా సాగటానికి టిఆర్ఎస్ అధినేత తనవంతు సాయం చేశాడు. శాసనసభ సమావేశం బహిష్కరణ పేరుతో టిఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా దూరంగా వుండటంతో సిఎం కిరణ్ పని సులువైంది. టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసనసభలో వుండగా ఏరోజు కూడా సమావేశం సజావుగా జరగలేదు. దీంతో అసలు బడ్జెట్ సమావేశాలు జరుగుతాయా? లేదా? అన్న అనుమానం కూడా వచ్చింది. అయితే తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా టిఆర్ఎస్ సమావేశాల్ని బహిష్కరించడంతో కథ సుఖాంతమైంది. కిరణ్‌తో కెసిఆర్ మ్యాచ్‌ఫిక్సింగ్ దీంతో రుజువైందంటూ జగన్ వర్గీయులు బాహాటంగా ప్రచారం చేస్తున్నారు. జూన్ నెలలో ప్రత్యేక తెలంగాణపై ఏదో ఒక స్పష్టమైన ప్రకటన వస్తుందని కెసిఆర్ చెబుతున్నాడు. తెలంగాణ ఇచ్చే పక్షంలో టిఆర్ఎస్ కూడా కాంగ్రెస్‌లో విలీనంకాక తప్పదు కాబట్టి అంతవరకు సహకరించాలన్నది కెసిఆర్ అంతరంగం. ఏదైతేనేం బడ్జెట్ సమావేశాల్ని విజయవంతంగా ముగించడానికి కెసిఆర్ పరోక్షంగా సహకరించాడంటూ కిరణ్ తన సన్నిహితులతో అంటున్నాడట.





తెప్పోత్సవానికి దేవేరులతో తరలి వెళ్తున్న రంగనాథస్వామి.



తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నర్తకి సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేస్తున్న తెలుగుదేశం పార్టీ నేతలు. రమేష్‌రెడ్డి, బీద రవిచంద్ర, డాక్టర్ జడ్.శివప్రసాద్, అనూరాధ తదితరులు.



ప్రపంచ కప్ క్రికెట్ పోటీలో భారత్ జట్టు గెలవాలని ఆకాంక్షిస్తూ నెల్లూరులో ప్రదర్శన చేస్తున్న క్రికెట్ అభిమానులు.

తెలుగు సంవత్సరాది 'ఉగాది'




తరతరాల భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల పరంపరలో ఉగాది పండుగ ఒక విశిష్ట స్థానాన్ని కల్గి వుంది. ఉగాది అనే పండుగ యుగాది అనే సంస్కృత పదానికి సమానార్థకంగా తెలుగునాట ప్రచారంలోకి వచ్చింది. ప్రతి సంవత్సరం చైత్రమాసం శుక్లపక్షంలో సూర్యోదయ సమయంలో పాడ్యమి తిథి ఏరోజున వుంటే ఆరోజును ఉగాదిగా పరిగణించడం పరిపాటి. ఆనాడు బ్రహ్మ దేవుడు తన సృష్టిని ప్రారంభించాడని భావించి ఆ ప్రారంభ సూచకంగా ఉగాది పండుగను జరుపుకొంటారు. తెలుగువారు జరుపుకొనే పండుగలలో ఈ పండుగకు విశేష ప్రాధాన్యముంది. ఉగాది నుంచే తెలుగు సంవత్సరం ప్రారంభం అవుతుంది కాబట్టి దీనిని తెలుగు ప్రజలు మొదటి పండుగగా భావిస్తారు. కొత్త పనులు ఆరోజునే ప్రారంభిస్తారు.

వసంత ఋతువులో వచ్చే ఉగాది పండుగ అనగానే చిన్నా పెద్ద అందరికి ముందుగా గుర్తుకు వచ్చేది ఉగాది పచ్చడి. తీపి, పులుపు, కారం, వగరు, చేదు, ఉప్పు అనే షడ్రచులు సమ్మేళనం ఈ పచ్చడి. సంవత్సరం పొడవునా ఎదురయ్యే మంచి చెడులు, కష్టసుఖాలను సమంగా స్వీకరించాలన్న సందేశాన్ని ఆరు రుచులు కలగలిసిన ఉగాది పచ్చడి ఇస్తుంది. మామిడి కాయలు, వేపపూత, చింతపండు, బెల్లం (చెరకు) పచ్చిమిరపకాయ, ఉప్పు కలిపి ఉగాది పచ్చడి తయారు చేస్తారు. ఈ పచ్చడి తినడం సాంప్రదాయమేగాక ఋతు మార్పు కారణంగా వచ్చే వాత, కఫ, పిత్త దోషాలను హరించే ఔషధంగా ఉగాది పచ్చడి పని చేస్తుంది.

ఉగాది పండుగనాడు సూర్యోదయానికి ముందే నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకొని అనంతరం తలంటుకొని స్నానం చేయాలి. నూతన వస్త్రాలను ధరించి దైవ దర్శనం చేసుకోవడం పరిపాటి. ఉగాది అనగానే గుర్తుకు వచ్చేవాటిలో మరొకటి పంచాగ శ్రవణం. పంచాగం అంటే తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం అనే ఐదు అంగాలతో కూడుకున్నది అని అర్థం. ఆదికాలం నుంచి జ్యోతిష శాస్త్రాన్ని భారతీయులు అనుసరిస్తూ వస్తున్నారు. ఈ శాస్త్ర ఆధారంగా ఆయా రాశులను బట్టి ఫలితాలను అనుభవజ్ఞుడైన పండితుని ద్వారా తెలుసుకొని గ్రహబాధల నుంచి ఉపశమనం పొందడం చేస్తారు. ఉగాది రోజు సాయంత్రవేళ దేవాలయ ప్రాంగణంలో ఈ పంచాంగ శ్రవణం చేస్తారు.


ట్రంకురోడ్డు

పరీక్షలంటే భయం లేదు!




రోజులు మారాయి. గతంలో పదవ తరగతి పరీక్షలంటే విద్యార్థులు, వారి తల్లితండ్రులు నానా హైరానా పడేవారు. పరీక్షల తేదీ ప్రకటన, ప్రీ పబ్లిక్, హాల్ టిక్కెట్లు రాక, ఎక్కడ సెంటర్ కేటాయించారన్న దానిపై ఎక్కడలేని ఉత్కంఠతను భరించేవారు. కానీ ఈ తరం పిల్లలు పరీక్షలంటే కామన్‌గా తీసుకుంటున్నారు. జిల్లాలో ఏర్పాటుచేసిన 180 పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షలు వ్రాస్తున్న 35వేల మంది విద్యార్థుల్లో ఏ కొద్ది మంది తప్ప మెజార్టీ పిల్లల్లో ఒత్తిడి కనిపించడం లేదు. స్కూళ్లలో రోజూ పరీక్షలు వ్రాసిన అనుభవసారంతో వీటిని లైట్‌గా తీసుకోవడం చూసేవారికి, వారి తల్లితండ్రులను విస్మయ పరుస్తుంది.

పాపం ప్రీతాప్‌రెడ్డి




గత వారంలో లెక్కింపు జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో నెల్లూరు స్థానిక సంస్థల స్థానం నుంచి స్వల్ప తేడాతో ఓడిపోయిన జగన్ వర్గం అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి రాజకీయ అమాయకత్వాన్ని గూర్చి ట్రంకురోడ్డులో చర్చించుకుంటున్నారు. కౌంటింగ్‌లో ముందు వరుసలో కూర్చొని అన్ని విషయాలను పరిశీలించిన ఆయన ఒక దశలో గెలిచారన్న భావనతో కాంగ్రెస్ చీఫ్ ఏజెంటు అభినందనలు సైతం అందుకొన్నారు. పోటీపోటీగా ఓట్లు పోల్ కావడం వల్ల అధికారులు సైతం ఒకటికి రెండుసార్లు బ్యాలెట్ పత్రాల పరిశీలన, తుది లెక్కింపు పనులు బాధ్యతాయుతంగా పూర్తి చేశారు. కౌంటింగ్ కేంద్రంలో ప్రక్రియ మొత్తం బాగా జరిగిందని ఎన్నికల అధికారి సమక్షంలో సంతకం పెట్టిన ఆయన ఇప్పుడేమో ఓట్ల లెక్కింపులో అన్యాయం జరిగింది. ఎందరో ఎమ్పీటీసీలు, జడ్పీటీసీలు రాజశేఖర్‌రెడ్డిపై అభిమానంతో ఓటువేసినా ఏడు ఓట్లు తక్కువ రావడమేమిటని హైదరాబాద్‌లో ప్రకటించడం చూసేవారికి కాస్త విచిత్రంగానే తోస్తుంది.

బీద వియోగం!




తెలుగుదేశం పార్టీలో సామాన్య కార్యకర్త కూడా రాష్ట్రస్థాయిలో నాయకుడిగా ఎదగగలడని నిరూపించి చూపిన వ్యక్తి బీద రవిచంద్ర. బీద సోదరులంటే ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడికి ప్రత్యేకాభిమానం. అందువల్లే వారికి పార్టీలో పలు పదవులిచ్చారు. ఆయన తోపాటు మరో ఇద్దరు సోదరులు జడ్పీటీసీలయ్యారు. తాజాగా మస్తాన్‌రావు ఎమ్మెల్యే కాగలిగారు. గత జడ్పీ చైర్మన్ ఎన్నిక సమయంలో ఒక ఓటుతో ఓడిపోయిన బీద రవిచంద్ర ఈ సారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేయనన్నా చంద్రబాబు తప్పదనేసరికి పోటీ చేశారు. పిట్ట పోరు పిల్లి తీర్చిన సామెత రీతిలో కాంగ్రెస్, జగన్ వర్గాల మధ్య రగడతో ఎమ్మెల్సీ కాగలననుకున్నాడు. డబ్బుకు డబ్బు ఖర్చు, పార్టీలోని కొందరు నేతలు సహకరించకపోవడంతో మూడవ స్థానంలో నిలిచిన ఆయన వెన్నుపోటుకు తెగ ఫీల్ అవుతున్నాడు. స్వగ్రామం ఇస్కపల్లిలో జరిగిన ముఖ్యుల సమావేశంలో ఆయన్ను విపరీతంగా అభిమానించే మత్స్యకారులు పార్టీ మారమని ఉచిత సలహా కూడా ఇచ్చారు. పార్టీ వల్లే ఇంతగా ఎదిగిన బీద సోదరులు ఈ ఓటమిని జీర్ణించుకోలేకపోతే ఎలానంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

బెట్టింగ్‌ల జోరు



వరల్డ్ కప్ క్రికెట్ అంటే క్రీడాభిమానులకు ఎంత సరదానో అంతకు మించిన సంతోషం బెట్టింగ్‌ల నిర్వాహకులకు. పోటీలు ప్రారంభమైనప్పటి నుంచి ఇవి జోరుగా సాగుతున్నా సెమీ ఫైనల్‌లో దాయాదులు పాకిస్తాన్ – ఇండియా జట్ల మధ్య పోరుకు బెట్టింగ్‌లు తారాస్థాయికి చేరుకొన్నాయి. సందట్లో సడేమియాగా కావలి పోలీసులు క్రికెట్ బెట్టింగ్‌ల స్థావరాలపై దాడులుచేసి ఒకటిన్నర లక్ష రూపాయల నగదు, టీవీ, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అయినా సరే జిల్లాలో జరుగుతున్న బెట్టింగ్‌లు మాత్రం కోట్ల రూపాయలకు ఎగబ్రాకాయి.

మాయల మరాఠీలు



పదో తరగతి పరీక్షల్లో అవినీతి అక్రమాలకు అంతే వుండదు. ప్రతి ఏడాది ఇవి షరామామూలే. ఈ ఏడాది ఇన్విజిలేషన్ డ్యూటీలు, సూపరింటెండెంట్ల నియామకాలన్నింటిలోనూ అక్రమాలు చోటు చేసుకొన్నాయి. కార్పొరేట్ సంస్థల నిర్వాహకుల కోరికలకు అనుగుణంగా ఈ నియామకాలు జరిగినట్లు సమాచారం. అయ్యోర్లకు భలే గిరాకీ ఏర్పడడంతో వారంతా రెండు విధాల సంపాదించి మాయల మరాఠీలను గుర్తుకు తెస్తున్నారు.



మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

ప్రియ వార్తాశ్రవణం. కుటుంబంలో మీ పలుకుబడి పెరుగుతుంది. నూతన వస్త్రాదులు ధరించి ఎంతో సంతోషంగా కానవస్తారు. ప్రముఖుల సహాయ సహకారాలు అందుతాయి. ధనసంపదలు, ఆస్తి పెంపుదల సూచన. జీవశక్తి చక్కగా ఉంటుంది. జ్వరాదుల పీడ అలర్జీ బాధలుంటాయి. జీవితభాగస్వామి బంధువులతో గొడవలుండవచ్చు. తల్లి అనారోగ్యం చింతనిస్తుంది. వృత్తిలో మార్పుచేర్పులుండవచ్చు.



వృషభం
కృత్తిక 2,3,4 పా. రోహిణి, మృగశిర 1,2 పా

భగవదారాధన వైపు మనసు పోనిస్తారు. పురోభివృద్ధికి సహాయ సహకారాలందించే వారితో మైత్రి ఏర్పడుతుంది. మిత్రులతో కలసి వినోదయాత్రలు చేసే అవకాశాలున్నాయి. వ్యాపార విస్తరణకు నూతన ప్రయత్నాలు చేస్తారు. సంతాన కారణంగా మనశ్చింత. నూతన విషయావగాహనకై యావ. సమాజంలో కొత్త వారితో పరిచయాలు ఏర్పడుతాయి. ఇష్టులైనవారితో సమాగమముంటుంది.



మిథునం
మృగశిర 3,4 పా. ఆర్ద్ర,పునర్వసు,1,2,3 పా

మిత్రులతో సమాగమం తద్వారా అనుకొన్నవి సాధిస్తారు. ధనాదాయం తృప్తికరంగా ఉంటుంది. వృత్తి ఉద్యోగాల్లో కోరుకొన్న మార్పులు చేర్పులు జరిగే సూచనలు. బంధువుల మూలంగా చిరు ఖర్చులు. ఆరోగ్యం చక్కగా ఉంటుంది. ప్రభుత్వం ద్వారా ఆదాయాలు. సంతానమూలంగా సుఖశాంతులు లోపిస్తాయి. ధనవిషయంలో లోటు ఉండదు. స్పెక్యులేషన్ కూడా లాభిస్తుంది.



కర్కాటకం
పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష

సమాజకార్యక్రమాలలో పాల్గొంటారు. గౌరవమర్యాదలు చక్కగా లభిస్తాయి. సోదరుల తోడ్పాటు చక్కగా వుంటుంది. వృత్తి వ్యాపారాలలో పురోభివృద్ధి చక్కగా ఉంటుంది. చిన్న చిన్న విరోధాలు మనశ్శాంతిని చెడగొడతాయి. ఇంటిలో ఆనందదాయకమైన పరిస్థితులు చోటు చేసుకొంటాయి. ఆర్థికవృద్ధికి, పొదుపునకు సంబంధించి చేసే పనులు ఫలవంతమవుతాయి.



సింహం
మఖ, పుబ్బ ఉత్తర 1 పా

శుభపరంపరలనందుకనే దినం. వినోదాలతో కాలక్షేపం చేస్తారు. సంతాన మూలకంగా ఖర్చులు. నూతన వ్యక్తులతో పరిచయం ఏర్పడుతుంది. తోటివారితో అభిప్రాయభేదాలు తొలగుతాయి. అప్పులు తీరుస్తారు. విరోధాలు పాటించేవారిపై మీదే పై చేయి. వృత్తిపరుల మూర్ఖతవల్ల నష్టపోయే అవకాశాలున్నాయి. రాజకీయులు లేనిపోని గొడవల్లో చిక్కుకొంటారు. ఉద్యోగులకు శ్రమ అధికం.



కన్య
ఉత్తర 2,3,4పా, హస్త, చిత్తా 1, 2 పా

శుభకార్యాలకై ఖర్చులు చేస్తారు. ఇరుగుపొరుగువారిని అనుసరించి పోవడం మంచిది. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని పరిస్థితి ఏర్పడవచ్చు. భగవంతుని ధ్యానానికి కొంత సమయం వెచ్చించాలి. విజయవంతంగా పనులు సాగుతాయి. అధికారుల నుండి కొంత ఆదరణ. అప్పులు తీరుతాయి. భాగస్వాములు మోసగించే అవకాశాలున్నాయి. వ్యాపారులకు పోటీలధికం. రాజకీయులకు ఉత్తమకాలం.

వారఫలాలు

తేది 2-4-2011 నుండి 8-4-2011 వరకు మీనంలో రవి, కుజ, గురువులు; మేషంలో బుధుడు; కుంభంలో శుక్రుడు; ధనుస్సులో రాహువు; కన్యలో శని; మిథునంలో కేతువు; మీన, మేష, వృషభాల్లో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

4తేదీ తెలుగు నూతన సంవత్సరారంభం.
ఉగాది పండుగ.

ఏప్రిల్ తిథులు


ఫాల్గుణ బహుళ

2	శని	చతుర్దశి	సా.5.35	గం.ల.వ
3	ఆది	అమావాస్య	రా.7.35	గం.ల.వ

చైత్ర శుద్ధ

4	సోమ	పాడ్యమి	రా.10.16	గం.ల.వ
5	మంగళ	విదియ	రా.12.36	గం.ల.వ
6	బుధ	తదియ	రా.2.31	గం.ల.వ
7	గురు	చవితి	తె.4.07	గం.ల.వ
8	శుక్ర	పంచమి	తె.5.17	గం.ల.వ

పి.ఎం.గోపాలాచారి
16/1020, పొగతోట, నెల్లూరు – 1.
E-mail:maripmgg@yahoo.com



తుల
చిత్తా 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా

సమాజంలో కొత్త వారితో పరిచయాలు ఏర్పడుతాయి. ఇష్టులైన వారితో సమాగమముంటుంది. కళత్రసంబంధీకులతో ఉదార హృదయంతో నడచుకోవాలి. మిత్రులు సాయమందించడానికి ముందుకు వస్తారు. కుటుంబ సభ్యులతో గొడవలకు అవకాశాలున్నాయి. వృథా ప్రయత్నాలు. గృహనిర్మాణకార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. కొత్త భాగస్వామి లేదా మంచి అనుచరులు లభిస్తారు.



వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జేష్ఠ

విందు వినోదాలలో ముఖ్యపాత్ర వహిస్తారు. చాలాకాలంగా ప్రయత్నిస్తూ వచ్చిన పనులు ఫలోన్ముఖమవుతాయి. పురప్రముఖుల పరిచయం ఆనందాన్నిస్తుంది. మనశ్చాంచల్యం. విశ్రాంతి తక్కువ. జాయింటు వ్యవహారాలు చక్కదిద్దుకొంటాయి. ఆకస్మిక సంఘటనలకు అవకాశాలున్నాయి. శత్రువులు లొంగి నడచు కొంటారు. బంధువులకు మీ చేతనైన సహాయం చేస్తారు.




ధనస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

ఇల్లుమార్పిడి, స్థలమార్పిడుల గురించి చింతిస్తారు. ఇంటికి సంబంధించి దుబారా ఖర్చు చేస్తారు. దూరప్రయాణావకాశాలు కానవస్తున్నాయి. మనశ్శాంతికై దేవాలయాలకు వెళ్తారు. వివిధమార్గాల ధనప్రాప్తి. అనుకూల వాతావరణం. తప్పనిసరిగా కొన్ని గృహోపకరణాలు కొనవలసి వస్తుంది. భాగస్వాములు మోసగించే అవకాశాలున్నాయి. ఉద్యోగులకు ప్రోత్సాహకాలు తక్కువ.



మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

నిరీక్షణ చేస్తూ ఉండిన వ్యక్తుల్ని కలుసుకొంటారు. దైవారాధన, పుణ్యక్షేత్రాటన వైపు మనసు పోనిస్తారు. చేతిలో చిల్లి గవ్వ నిలవదు. వచ్చినది వచ్చినట్లుగానే ఖర్చు అవుతుంది. ఆర్థికసమస్యలున్నా మనోధైర్యం కోల్పోరు. గృహాలంకరణ విషయాలలో ఆసక్తి చూపుతారు. ఖర్చుకు వెరవరు. విద్యార్థులకు ప్రయోజనవంతమైన కాలం. అన్ని రంగాలలో ముందంజ వేస్తారు.



కుంభం
ధనిష్ఠ 3,4 పా. శతభిషం, పూర్వ భాద్ర 1,2,3 పా

ఇంటిలో ఆనందదాయకమైన పరిస్థితులు చోటు చేసుకొంటాయి. ఆర్థికవృద్ధికి, పొదుపునకు సంబంధించి చేసే పనులు ఫలవంతమవుతాయి. వృత్తివ్యాపార రీత్యా కొత్త ఒప్పందాలు చేసుకొంటారు. ప్రభుత్వం నుండి ఆదాయావకాశాలు. శుభ వార్తాశ్రవణం. ఆరోగ్య విషయాలు అనుకూలం. వివిధ మార్గాలలో ధన ప్రాప్తి. నూతన గృహోపకరణాలు కొంటారు. ఉద్యోగవృద్ధి, వేతనవృద్ధి ఉంటుంది.



మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

బంధుమిత్రుల సమాగమం సుఖసంతోషాలనిస్తుంది. శ్రమకు తగ్గ ఫలితం లభిస్తుంది. గొప్పవారి వద్ద మీ సామర్థ్యాన్ని ప్రకటించి సన్మానింపబడతారు. వ్యాపారవృద్ధికై అప్పులు చేస్తారు. చేపట్టిన పనులు చక్కగా నిర్వహిస్తారు. ఉద్యోగ, వృత్తి విషయాలు చక్కగా సాగుతాయి. ఒకటికి రెండుసార్లు ఆలోచించి చేయడం మంచిది. వ్యాపారులకు అమ్మకాలు తగ్గుముఖం పడతాయి. రాజకీయులకు దురదృష్టకాలం.

రాజవీధి వైపే గృహాలు వుండాలి!

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

పి.లక్ష్మీరమణ పొదలకూరు

** గృహాలు, ప్లాట్లలో రోడ్డు దిక్కుగాక వేరొక దిక్కు గృహాలలో నివసించవచ్చునా?*

రాజవీధివైపే గృహాలు, అపార్టుమెంటు ప్లాట్లు నిర్మించాలి. దక్షిణ రోడ్డుకి తూర్పు, పశ్చిమం రోడ్డుకి ఉత్తరం నిర్మాణాలు దోషం.

ఎం.ధనుంజయరావు సీతారామపురం

** వ్యాధి, మరణం, ఆర్థిక నష్టం, వివాహ విచ్ఛేదనం వంటి అనేక సమస్యలున్నప్పుడు ఏం చేయాలి?*

మయవాస్తులో ఈ బాధలకు ఈశాన్యం 'కుంభ ప్రతిష్ట' మార్గమని చెప్పారు. సుదర్శన యంత్రం కూడా చాలావరకు సమస్యల్ని పరిష్కరిస్తుంది.

పి.దశరధరెడ్డి సూళ్ళూరుపేట

** గృహాల్లో పెద్దవారు, చిన్నవారు ఫలానా వైపు ఉండాలంటారు. అలా కుదరనప్పుడు పరిష్కారం ఏమిటి?*

శాస్త్ర ప్రకారమే నిబంధనల్ని పాటించాలి. అలా కుదరనప్పుడు తల్లిదండ్రులుంటే కుమారులు వారికి వస్త్రదానం, సువర్ణదానం చేస్తే అవాంతరాలు ఉపశమిస్తాయి.

ఎల్.ఎన్.కె.ఆర్ బెంగుళూరు

** ఆస్తి అతను ఇవ్వడు. అమ్మ అతణ్ణే సపోర్టు చేస్తుంది. అతని పీడ వదిలించుకోవాలనుకుంటున్నాను.*

తల్లిదండ్రులు ఏదిచేసినా మీ మంచి కోసమే చేస్తారు. తొందరపాటు అనర్థదాయకం. వాళ్లతో మంచి మనసుతో మాట్లాడండి. వ్యక్తుల్ని మార్చడానికే తప్ప అంతం చేయడానికి మాయలూ, మంత్రాలు లేవు.

ఎర్నేని నారాయణస్వామి తిరుపతి

** దక్షిణ రోడ్డు స్థలంలో అపార్టుమెంటులో తూర్పు గృహం కొనవచ్చా?*

దక్షిణం యమస్థానం. తూర్పు, పశ్చిమ గృహాలు ఇంద్ర, వరుణ స్థానాలకు చెందినవి. యమ స్థానానికి వ్యతిరేక స్థానాలివి. యమ గ్రహ దోషం కలుగుతుంది.

డాక్టర్ షేక్ అహ్మదుల్లా బెంగుళూరు

** వాస్తు, జ్యోతిష శాస్త్రాల పేర చాలా దోపిడీ జరుగుతుంది. ఛాందసాలు ప్రచారం చేస్తున్నారు.*

దోపిడీ విధానం వాళ్ల వాళ్ల దుర్మార్గపు మనస్తత్వాన్ని బట్టి వుంటుంది. ఇందుకు డాక్టర్లు, దేశీయ శాస్త్రజ్ఞులు మినహాయింపు కాదు.

డాక్టర్ చంద్రమౌళి బెంగుళూరు

** అపార్టుమెంటులో అండర్‌గ్రౌండ్ గోడౌన్ నిర్మాణం విధానాలు చెప్పండి?*

మూలల్లో ఒక్క ఈశాన్యంలో తప్ప ఎక్కడా అండర్ గ్రౌండ్ స్టోర్స్(నేల మాళిగలు) రాకూడదు. తప్పనిసరైతే నాలుగు దిక్కుల్లోనూ సరిగ్గా మధ్య స్థానాల్లో (మొత్తం ఆరు భాగాలు చేసి మధ్య రెండు భాగాల్లో) నిర్మించుకోవచ్చు.

ఐ.జానకిరామయ్య గుంటూరు

** అపార్టుమెంటులో ఇంటి వరకూ వాస్తు సరిచేసుకుంటే సరిపోతుందా? బయటి ప్రభావం వుంటుందా?*

నిర్మాణ సమయంలో వాస్తు ప్రకారం ప్లాటు నిర్మించుకొన్నప్పటికీ బాహ్య వాస్తు దుష్ప్రభావాలు వుంటాయి. నివారణ కోసం సంబంధిత యంత్ర ప్రతిష్ట తప్పనిసరిగా చేసుకోవాలి!

గరిమెళ్ల జనార్దన్‌రెడ్డి చెన్నై

** స్థలం కోణాకృతిలో వుంది. నిర్మాణం దీర్ఘ చతురస్రంగా కట్టినా అన్ని దిక్కుల్లోనూ 'కోణ' స్థలాలు మిగులుతున్నాయి.*

ఆశ బిల్డర్‌దే అయినా మీరు కొంటున్నారు కాబట్టి వాళ్లలాంటి అరాచకపు పనులు చేస్తున్నారు. డిమాండ్ లేనప్పుడే వాళ్లు బుద్ధి మార్చు కొంటారు.

జాలపు గౌరి నెల్లూరు

** వాస్తులో ప్రాధాన్యత స్థలానికా లేక నిర్మాణానికా?*

స్థలం, నిర్మాణాలు రెండింటికీ వాస్తు, జ్యోతిష శాస్త్రాలలో ప్రాధాన్యతలున్నాయి. అయితే స్థలం మొదటిది. నిర్మాణం రెండవది. స్థలమెరిగి నివాసాలు, కులమెరిగిన చుట్టరికాలు అన్నది సామెత.

పి.ప్రసూనలక్ష్మి ఉదయగిరి

** శీతల యంత్ర ప్రతిష్ట తర్వాత 'అత్త' రోగం నిమ్మళించింది.*

ఇరవై ఎనిమిది యంత్రాలలో ఒక్కో యంత్రానికి కొన్ని నిర్దుష్టమైన విధులున్నాయి. యంత్ర బీజాక్షర యుక్తాలు కాబట్టి వాటి విధిని తప్పక నిర్వర్తిస్తాయి. గృహస్థు సంకల్పసిద్ధి గలవారైతే మరింత ఫలితం వుంటుంది.

గ్రామాల్లో బసకు మంగళం!

గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండవ శనివారం రాత్రి జిల్లా అధికారులు గ్రామాల్లో బస చేసే కార్యక్రమానికి మొత్తం మీద మంగళం పాడేశారు.


గ్రామీణ ప్రాంతాల్లో అంటరానితనం నిర్మూలనకు కృషి చేయడంతోపాటు ప్రజలతో కలిసి బస చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరకుండాపోతోంది. 2005 సంవత్సరంలో గ్రామాలలో బస కార్యక్రమాన్ని నిర్వహించింది అధికారయంత్రాంగం. ప్రతి నెల రెండవ శనివారం రాత్రి మండలంలోని ఏదోఒక గ్రామాన్ని అన్ని శాఖల అధికారులు సందర్శించి వివిధ సమస్యలపై ప్రజలతో చర్చించి బస చేసేవారు. మండలస్థాయి అధికారులతోపాటు జిల్లా కలెక్టర్ సైతం గ్రామాలకు వెళ్లేవారు. ఇలా అధికార యంత్రాంగం గ్రామాలకు తరలి వచ్చి రాత్రిపూట బస చేయడంతో ప్రజలు ఎంతో సంతోషించేవారు.

రాత్రి బస చేసిన అధికారులకు గ్రామీణ ప్రాంతాలలో ఎదురవుతున్న పలు సమస్యలపై ప్రజలు వివరించేవారు. ఈ కార్యక్రమం కొంత మేర ఫలితాలు సాధిస్తున్న క్రమంలో గ్రామాలలో బస అధికార యంత్రాంగం డుమ్మాకొట్టింది. జస్టిస్ పున్నయ్య కమిషన్ చేసిన సిఫార్సులతో గ్రామాలలో బస చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీల హక్కుల గురించి వివరించడంతోపాటు ప్రతినెల రెండవ శనివారం మండలంలోని ఏదోఒక గ్రామంలో పౌరహక్కుల దినం నిర్వహించాలని స్పష్టంగా పేర్కొన్నారు. నివేదికలోని అంశాలను అమలు చేయాలని దళిత సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో గ్రామాలలో బస చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.

రాష్ట్రంలో ప్రభుత్వం సంక్షోభంలో వుండడంతో జస్టిస్ పున్నయ్య కమిషన్ నివేదికలోని అంశాల అమలకు తగిన ప్రాధాన్యత లభించకుండాపోయింది. ఆ నివేదికలోని అంశాలను పారదర్శకంగా అమలు చేయాల్సిన అధికారులు కూడా పూర్తిగా పట్టించుకోవడం మానేశారు. ప్రభుత్వం వైపు నుంచి అధికారులపై ఒత్తిడి వుండడం లేదు. పున్నయ్య కమిషన్ దళితుల సంక్షేమం, అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పథకాలు, కార్యక్రమాల గురించి చేసిన సూచనలు, సలహాలు నేటికీ అమలుకు నోచుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు అసెంబ్లీ సమావేశాల్లో కూడా కమిషన్ గురించి ప్రస్తావించడం మరచిపోయినట్లున్నారు.

జగజ్జీవన్‌రామ్, అంబేద్కర్ జయంతి వర్ధంతుల సమయంలో సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి ఉపన్యాసాలు ఇచ్చేందుకే ప్రజాప్రతినిధులు పరిమితమై పోతున్నారు. మిగిలిన సమయంలో దళితులు గురించి ఎక్కడా ప్రస్తావించరు. నెల్లూరు జిల్లాలో మెట్టప్రాంతాలలో నేటికి ఎస్సీ, ఎస్టీలను దేవస్థానాలలోకి అనుమతించని సందర్భాలున్నాయి. టీ దుకాణాలలో రెండు గ్లాసుల పద్ధతి కొనసాగుతుంది. ఇందుకోసం అనేక సంవత్సరాల నుంచి ఆందోళన చేస్తున్నా తూతూ మంత్రంగా అధికారులు చర్యలు తీసుకొంటున్నారన్న ఆరోపణలున్నాయి. చట్టాలు, హక్కులపై మరింత అవగాహన కల్పించి ఎస్సీ, ఎస్టీ కాలనీలలో రాత్రిపూట ఉన్నతాధికారులు బస చేయాలి.

జిల్లా కలెక్టర్ లాంటి పున్నతాధికారి పౌరహక్కుల దినోత్సవం గురించి మరచిపోవడంతో క్రిందిస్థాయి అధికారులు గ్రామాలవైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రాత్రిపూట గ్రామాలలో బస చేయడంతోపాటు జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలుకోసం కృషి చేయాల్సిన అవసరం వుంది.



ముఖ్య విధి మరచిన జిల్లా అధికార యంత్రాంగం.

పరిష్కారమెప్పుడు?

రచ్చబండ వినతుల సంగతేమిటి?

రాష్ట్ర ప్రభుత్వం ఏ కార్యక్రమం తలపెట్టినా ప్రారంభంలో చూపించిన ఉత్సాహం తుది వరకు చూపించడంలో విఫలం చెందుతుంది. ప్రభుత్వం పట్ల ఎంతో విశ్వాసంతో వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించిన వినతి పత్రాలు ప్రభుత్వ కార్యాలయాల్లో దుమ్ముకొట్టుకొంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన రచ్చబండ కార్యక్రమంలో వేలాది వినతి పత్రాలు అందాయి. దాదాపు 25 రోజులపాటు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. నిధుల కొరత వుండకూడదన్న లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా 2,500 కోట్లు విడుదల చేసినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.

జిల్లాలో 25రోజుల పాటు జరిగిన రచ్చబండ కార్యక్రమంలో వివిధ సమస్యలపై అధికార యంత్రాంగానికి వేలాది వినతి పత్రాలందాయి. కాని వీటి పరిష్కారానికి ఇంతవరకు ప్రయత్నించిన పాపాన పోలేదు.

రచ్చబండ కార్యక్రమంలో ప్రధానంగా రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ గృహాల మంజూరు, తాగునీటి ఎద్దడి నివారణ తదితర సమస్యలపై ప్రజలు వినతి పత్రాలు సమర్పించడం జరిగింది. ప్రభుత్వం పరువు దక్కించుకోవాలన్న సంకల్పంతో రేషన్ కార్డులు జారీ చేయకపోయినా ముందుగా బియ్యం, కిరోసిన్ కూపన్లు గతనెలలో పంపిణీ చేశారు. అయితే పంపిణీ చేసిన కూపన్లకు కోటా విడుదల చేయడంలో మాత్రం శ్రద్ధ చూపలేకపోయారు అధికారులు. కూపన్లు పొందిన లబ్దిదారులు మాత్రం రేషన్‌షాపుల చుట్టూ తిరుగుతూ డీలర్లను ప్రాధేయపడాల్సిన దుస్థితిలో వున్నారు.

ఈ కార్యక్రమం ద్వారా అందిన అన్నిరకాల వినతి పత్రాలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని ముఖ్యమంత్రితోపాటు జిల్లా మంత్రి, కలెక్టర్ ప్రకటించారు. ఈ కార్యక్రమం ముగిసి నెలరోజులు గడుస్తున్నా వీటి గురించి పట్టించుకునే దిక్కు లేకుండాపోయింది. మండల స్థాయిలో వుండే వివిధ శాఖల ద్వారా సంబంధితశాఖల జిల్లా అధికారులకు ప్రతిపాదనలు కూడా అందాయి. గతంలో పెండింగ్‌లో వున్న వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్లు మాత్రం మంజూరు చేశారు. ఇవి కూడా ఏప్రెల్ నుంచి లబ్దిదారులకు అందించే అవకాశం వుంది. ఇందిరమ్మ గృహాల బిల్లులు, రేషన్‌కార్డుల జారీపై కసరత్తు జరగలేదు.

రచ్చబండ కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కరింపబడతాయని ఆశించిన గ్రామీణప్రాంత ప్రజలకు అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా ఒక్క పని కూడా జరగలేదు. మండలాల్లో రోజుకు రెండు, మూడు గ్రామ పంచాయితీలలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులతోపాటు, స్థానిక ఎమ్మెల్యేలు కూడా పాల్గొని ప్రజలకు లేనిపోని వాగ్దానాలు చేసేశారు. ఎమ్మెల్యేల వాగ్దానాలు నమ్మిన ప్రజలు వాటి అమలుకోసం కృషి చేయకపోవడంతో విమర్శలు గుప్పిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక పరిస్థితి ఏమాత్రం మెరుగ్గా లేకపోవడం కూడా సమస్యలు పరిష్కరించ లేకపోవడానికి మరో కారణంగా చెబుతున్నారు.


రచ్చబండ కార్యక్రమంలో వినతులిస్తున్న ప్రజలు.

25రోజులపాటు ప్రభుత్వ కార్యాలయాలను వదలి గ్రామాల్లో ఈ కార్యక్రమం కోసం పర్యటనలు చేసిన అధికారులు ఏం సాధించారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండల రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాలకెళ్లి సమస్యలు గురించి అడిగితే జిల్లాస్థాయి అధికారులకు ప్రతిపాదనలు పంపామని అక్కడ నుంచి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని సమాధానం చెబుతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ రచ్చబండ వినతులపై స్పందిస్తే బాగుంటుంది.



చట్టం - చెత్త

✍ అల్లూరు రహీం

చట్టంలోని లొసుగుల వల్ల నేరస్తులు, అక్రమార్కులు తప్పించుకొని ఘరానాగా తిరగడం అన్యాయం అన్న సింగిల్ పాయింట్‌పై విస్తరించిన కథనే చట్టం సినిమా. విశాఖ టాకీస్ పతాకంపై నట్టికుమార్ ఈ చిత్రాన్ని నిర్మించాడు. దర్శకుడు పి.ఏ.అరుణ ప్రసాద్. కథ, మాటలు, స్క్రీన్‌ప్లే అన్నీ విశాఖ టాకీస్ యూనిట్ వ్రాసిందని వెండితెరపై వేశారు. రాష్ట్రంలో గతంలో జరిగిన ఇద్దరు ఇంజనీరింగ్ చదివే యువతులపై యాసిడ్ దాడి, విజయవాడ బాలిక నాగవైష్ణవి కిడ్నాప్ అనంతరం హత్యల నేపథ్యంలో అల్లుకొన్న కథతో ప్రథమార్ధం ముగుస్తుంది. ద్వితీయార్థంలో ముంబాయి నగరంపై పాకిస్తాన్ ముష్కరులు చేసినదాడి, తీవ్రవాది అజ్మల్ కసబ్‌కు ముంబాయిలోని ఆర్థర్ జైలులో జరుగుతున్న రాజపోషణ వరకు విస్తరిస్తుంది. ఈ మూడు సమకాలీన సంఘటనలను సినిమాగా మల్చను దర్శకుడు జగపతిబాబు, హీరోయిన్ విమలా రామన్, సిబిఐ అధికారి పాత్రలో మురళీ శర్మలను ఎంచుకొన్నాడు. రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డి ఈ చిత్రంలో మహారాష్ట్ర హోంమంత్రిగా కీలక పాత్ర పోషించాడు. చిత్రం సాగతీతలో భాగంగా వెటరన్ సినీ హీరోలను కిండల్ చేస్తూ రాహుల్‌బాబు పాత్రను సృష్టించారు. మూడు సమకాలీన సంఘటనలను చిత్రీకరించడంలో నాటకీయత రాబట్టడంలో దర్శకుడు పూర్తిగా విఫలమయ్యాడు. తనపై నమ్మకం లేకనే హీరోయిన్ విమలారామన్‌తో పాటు వ్యాంప్ పాత్రలో కనిపించే ఆషా షైనీల చేత అంగాంగ ప్రదర్శన చేయించాడు. ఈ చిత్రంలో హద్దూపద్దూలేని దేహ ప్రదర్శన చేసిన విమలా రామన్, హీరో జగపతి బాబుకు మూడు ముద్దులు పెట్టింది. యోగా టీచర్‌గా కనిపించే ఆమె ధం... ధక్ నా థిల్లానా పాటలో రెచ్చి పోయింది. ఆశాషైనీ బార్ గాళ్‌గా 'వచ్చేయ్' పాటలో శృతిమించి పోయింది. ఈ సినిమాలో కొన్ని సన్నివేశాలను చూస్తే సెన్సార్ అధికారులు కళ్లుమూసుకొని ఈ చిత్రాన్ని తిలకించారా అనే సందేహం కలగక మానదు. తీవ్రవాది అజ్మల్ కసబ్ రక్షణ కోసం ప్రభుత్వం ఆరు కోట్లు వెచ్చించి బంకర్ కొనడం, అతని భద్రత కోసం రోజుకు 8లక్షలు ఖర్చు పెట్టడం మొదలైన అంశాల నేపథ్యంలో కోర్టులో సాగే డైలాగులు బాగున్నాయి. న్యాయ వ్యవస్థను ఇక్కడ హీరో తీవ్రంగా నిందిస్తాడు. కోర్టులు దద్దమ్మలనే డైలాగును పెద్దమ్మలుగా సెన్సార్ అధికారులు చేసినట్లున్నారు. మన వ్యవస్థకు మానభంగం జరిగిందనే డైలాగు ఆలోచింపజేస్తుంది. చిత్రంలో కామెడీ కోసం లింక్ చేసిన జగపతిబాబు, నీతూసింగ్ ప్రేమకథ ఎపిసోడ్ అతిగా వుంది.

చిత్ర సమీక్ష

చిత్రకథలోనికి వెళ్తే సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గౌరీశంకర్ (జగపతిబాబు) తన విధి నిర్వహణను పరమచెత్తగా చేస్తుంటాడు. పోలీసు కమిషనర్ భార్య వెనుక ఆర్డర్లీలా సామాన్లు మోస్తాడు. రౌడీ పంచాయితీలు చేసి డబ్బు గడిస్తుంటాడు. యోగా టీచర్ సింధు (విమలారామన్) హెడ్ కానిస్టేబుల్ రంగారావు(జీవా) కుమార్తె. తనతండ్రి, గౌరీశంకర్ చేసే పనులకు తిట్టిపోస్తుంటుంది. ఇంతలో ప్రసాద్ (ప్రసాద్‌బాబు) కుమారులు ఇంజనీరింగ్ చదివే విద్యార్థినులపై యాసిడ్ దాడి చేస్తారు. మరో వారం రోజుల తర్వాత ఓ వ్యాపారవేత్త కుమార్తె వైష్ణవిని నిప్పుల కొలిమిలో వేసి దహనం చేస్తారు. విచిత్రంగా ఈ రెండు సంఘటనలకు కారకులైన వ్యక్తులు హతమవుతారు. వీటిపై విచారణకు వచ్చిన సిబిఐ అధికారి శరత్(మురళీశర్మ) ఈ హత్యలు చేసింది ఇన్స్‌పెక్టర్ గౌరీశంకర్ అన్న నిర్ధారణకు ఆధారాలతో సహా వస్తాడు. ఇంతలో గౌరీశంకర్ ముంబాయిలో ప్రత్యక్ష మవుతాడు. అక్కడ అమ్మాయిలను విదేశాలకు తరలించే ముఠాను మట్టుబెట్టి పాకిస్తాన్ తీవ్రవాది అజ్మల్ కసబ్ వుండే జైలుకు వెళ్తాడు. అజ్మల్ కసబ్ వల్ల గౌరీశంకర్ కుటుంబం మొత్తం హోటల్ మారియట్‌లో హతమవుతుంది. మహారాష్ట్ర హోంమంత్రి(ఏరాసు ప్రతాప్‌రెడ్డి) కుమారుడిని ఆశాషైనీతో కిడ్నాప్ చేయించిన గౌరీశంకర్ కసబ్‌తో ఐదు నిమిషాల ముఖాముఖీ కోరి అతడ్ని హతమార్చడంతో సినిమా పరిసమాప్తమవుతుంది.

రెండు పార్శ్వాల ఇన్స్‌పెక్టర్ పాత్రలో జగపతిబాబు బాగా నటించాడు. హేమంత్ కర్కరేను గుర్తుకు తెచ్చే పోలీసు అధికారి పాత్రను ఆశిష్ విద్యార్థి చక్కగా పోషించాడు. వీరందరినీ అజ్మల్ కసబ్ పాత్రధారి అమిత్‌ధామన్ అధిగమించాడు. నటనలో మన విలన్లు ఈయన నటనను చూసి కాస్త నేర్చుకోవాల్సి వుంది. చట్టం చిత్రంలో నవరసాలు కొరవడడం వల్ల ఇది కొందరికే నచ్చుతుంది.



విహార యాత్రకు త్రిష

అందాల హీరోయిన్ త్రిష ఇప్పుడు సెలవులను సరదాగా గడుపుతోంది. ఒకవైపు తీన్‌మార్ షూటింగ్, ఆడియో విడుదల కూడా పూర్తయ్యింది. మరోవైపు ఒప్పుకొన్న తమిళ చిత్రాలు మొదలు కావడానికి మరింత సమయం వుంది. దీంతో త్రిష తన స్నేహితులతో కలసి జైపూర్ వెళ్లింది. అక్కడి ప్రసిద్ధి చెందిన అడవుల్లో షికారుకెళ్లి జంతువుల్ని చూస్తూ మురిసిపోతోంది. జైపూర్‌లోని రణతంబోర్ అడవుల్లో త్రిష మకాం వేసింది. అక్కడ సకల సదుపాయాలతో కూడిన తాత్కాలిక నివాసం కూడా ఏర్పాటు చేయించుకొంది. ఏడు నక్షత్రాల హోటల్‌లో వుండే వసతి సౌకర్యాలన్నీ ఆ టెంట్‌లో వున్నాయట. బడలికపోయి రీఛార్జ్ అవ్వడానికి ఇంతకు మించిన దారి కనపడలేదంటుంది.

ఛాన్స్ కొట్టిన అనుష్క

విలక్షణ దర్శకుడు మణిరత్నం తెలుగు, తమిళ భాషల్లో ఓ చిత్రాన్ని తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నాడు. ఈ చిత్రంలో మహేష్ బాబు కథానాయకుడిగా నటిస్తాడు. విజయ్, ఆర్యలు కూడా ఇందులో కథానాయకులుగా కనిపించే అవకాశం వుంది. అటువంటి ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించే ఛాన్స్ అనుష్కకు దక్కిందంటున్నారు. చారిత్రక అంశాల నేపథ్యంలో నడిచే కథాంశమిది. తెలుగు, తమిళ భాషల్లో వున్న ఆదరణ దృష్ట్యా ఈ సినిమాకు అనుష్క అయితే బాగుంటుందని మణిరత్నం తలచి ఈ ఎంపిక చేశారట. మణిరత్నం సినిమాలో అవకాశం అంటే మాటలా? మణిరత్నం అడగగానే అనుష్క ఓకె అందట. ప్రస్తుతం అనుష్క రెండు సినిమాలలో బిజీగా వుంది. ఇవి పూర్తవ్వగానే మణిరత్నం సినిమాలో నటిస్తుంది.





కాజల్‌కు అవమానం!

హీరోయిన్ కాజల్‌కు తమిళ చిత్రసీమ అంతగా కలసి రావట్లేదు. ఆ మధ్య సూర్య తమ్ముడు కార్తితో 'నాన్ మహాన్ అల్ల' అనే చిత్రంలో నటించినా ఆమెకు తగినంత గుర్తింపు రాలేదు. ఇటీవల తమిళంలో శింబు సరసన నటించే ఛాన్స్ వచ్చినట్లే వచ్చి చేజారింది. హిందీలో విజయవంతమైన 'దబాంగ్' చిత్రాన్ని తమిళంలో శింబు హీరోగా రీమేక్ చేస్తున్నారు. శింబు సరసన కాజల్ అయితే బాగుంటుందని సంప్రదింపులు చేశారట. అంతా ఓకే అన్నాక సోనమ్ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుందని ప్రకటించారు. ఈ విషయమై కాజల్ అడిగితే నీ కన్నా సోనమ్ కపూర్ పొడవు, తన ప్రక్కన కాస్త పొడగరి హీరోయిన్ అయితే బాగుంటుందని హీరో చెప్పారని చెప్పడంతో కాజల్‌కు కోపం నషాలానికి చేరిందట.

వయస్సుతో పనేమిటి?

తమిళ, తెలుగు భాషల్లో సెల్వరాఘవన్ దర్శకత్వంలో రూపొందబోయే చిత్రంలో కమల్‌హాసన్ హీరోగా నటిస్తున్నాడు. ఆయన సరసన హీరోయిన్‌గా శతృఘ్న సిన్హా కుమార్తె సోనాక్షిని ఎంపిక చేశారు. ఈవిషయమై ఇటీవల హైదరాబాద్ వచ్చిన సోనాక్షి మాట్లాడుతూ నా కన్నా వయస్సులో 33ఏళ్లు పెద్దవాడైన కమల్‌తో ఎందుకు జత కడుతున్నావని కొందరు సన్నిహితులు నన్ను అడిగారు. అయినా అందులో తప్పేముంది? అసలు కెమెరా ముందుకు వచ్చాక వయస్సుతో పనేముంది? పాత్ర స్వభావాన్ని అనుసరించి నాయిక నడచుకోవాల్సిందే. వయస్సు ప్రకారమే నటించాల్సి వస్తే నా తొలి చిత్రం 'దబాంగ్'లో సల్మాన్‌ఖాన్‌తో, ఇప్పుడు అక్షయ కుమార్‌తో జోడికట్టేదాన్ని కాదంటుంది. మళ్లీ తెలివిగా జగమెరిగిన నటుడు కమల్ హాసన్ సరసన అవకాశమొస్తే ఎవరు కాదంటారంటుంది.





అంత లేదు!

యువహీరో అల్లు అర్జున్ పాత్రికేయులతో తన పెళ్లి విశేషాలు ముచ్చటించారు. మాది పెద్దలు చేసిన ప్రేమ పెళ్లి. కామన్ ఫ్రెండ్స్ ద్వారా నేను స్నేహకు పరిచయమయ్యాను. చాలా వరకు ప్రేమను వ్యక్తం చేయడంలో అబ్బాయిలే ముందుంటారు. ఈవిషయంలో తాను అంతేనన్నారు. నేను నటిస్తున్న బద్రీనాథ్ చిత్రాన్ని మగధీరతో పోలుస్తున్నారు. అంతలేదు. మగధీర లాంటి గొప్ప సినిమా ఏ దశాబ్దానికో ఒకటి వస్తుందన్నారు. హనీమూన్ అయ్యాక మూడు చిత్రాల్లో నటించ వచ్చన్నారు.

ఎంసెట్‌కు తగ్గిన క్రేజ్

ఇంటర్మీడియట్ పూర్తయిన తర్వాత విద్యార్థులందరూ మనసు లగ్నం చేసేది ఎంసెట్‌పైనే. ఇంజనీరింగ్, మెడికల్ కోర్సులు చేసేందుకు కామన్ ఎంట్రన్స్ పరీక్ష ఎంసెట్‌కు ఎంతో క్రేజ్ వుంది. కానీ ఈ ఏడాది మాత్రం విద్యార్థుల అభిరుచుల్లో మార్పు వచ్చిందనేందుకు ఎంసెట్ దరఖాస్తుల సంఖ్య గణనీయంగా తగ్గడమే నిదర్శనం. విద్యార్థులు తమ జీవన గమనాన్ని మార్చుకొనేందుకు ప్రముఖంగా చెప్పుకొనే ఎంసెట్ దరఖాస్తులు తగ్గడం పలువురిని ఆశ్చర్య పరుస్తోంది. మార్చి నెల 16 తేదితో ఈ దరఖాస్తులను పరిశీలించినట్లయితే ఎంసెట్‌పై క్రేజ్ తగ్గిందనేది స్పష్టం అవుతుంది. ఈ ఏడాది ఇంజనీరింగ్‌కు 9325 మంది దరఖాస్తు చేసుకోగా, మెడిసిన్‌కు వచ్చిన దరఖాస్తులలో గత ఏడాదికి ఈ సంవత్సరానికి పెద్ద తేడా లేదు. గత సంవత్సరం ఇంజనీరింగ్‌కు 16వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, ఈ ఏడాది కేవలం 9,325 మంది మాత్రమే దరఖాస్తు చేశారు. ఎంసెట్‌పై విద్యార్థుల్లో ఆసక్తి తగ్గడానికి, ముఖ్యంగా ఇంజనీరింగ్ పట్ల నిరాసక్తత చూపడానికి పలు కారణాలున్నట్లు విద్యారంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఇంజనీరింగ్ కళాశాలలు ఇబ్బడిముబ్బడిగా వుండడం, నాణ్యమైన విద్యనందించే అధ్యాపకులు లేకపోవడం, సౌకర్యాలు లేకపోవడం, ఉత్తీర్ణతా శాతం పెరగకపోవడంతోపాటు ఫీజు రీఎంబర్స్‌మెంట్ సక్రమంగా అమలు కాకపోవడం కూడా ఇంజనీరింగ్ పట్ల విద్యార్థుల్లో ఆసక్తి తగ్గడానికి కారణమని విశ్లేషిస్తున్నారు నిపుణులు.

తగ్గిన దరఖాస్తులు

డిగ్రీ పరీక్షల్లో అక్రమాలు

● స్పెషల్ ఫీజు చెల్లిస్తే పాస్

పరీక్షలొచ్చాయంటే అక్రమార్కులకు పండుగే. అన్నివిధాల అడ్డదారులు తొక్కుతూ విద్యార్థులకు తమవంతు సహకారం అందించేందుకు కొందరు సిబ్బంది ఎప్పుడూ ప్రభు భక్తిని ప్రదర్శిస్తూనే వుంటారు. ఇలాంటి అక్రమాలే డిగ్రీ పరీక్షల్లో జరుగుతుండడం విశేషం. నగరంలో సెంట్రల్ జైలుకు సమీపంలో గల డిగ్రీ కళాశాలలో పెద్ద ఎత్తున అక్రమాలకు అక్కడి సిబ్బంది తెరలేపారు. కళాశాలలో పరీక్ష వ్రాసే విద్యార్థులకు ఆ కళాశాలలో క్లర్కు నుంచి మేనేజర్ వరకు అన్నీతానై విధులు నిర్వహించే ఒక వ్యక్తి విద్యార్థుల వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకొని పూర్తి సహకారమందిస్తాడట. విద్యార్థులకు మార్కులు తక్కువొస్తాయని అనుమానమున్న సబ్జెక్టు పేపర్లు ముందుగా ఆ వ్యక్తిని సంప్రదించి ఐదువేల నుంచి పదివేల రూపాయలందిస్తే ఆ విద్యార్థి వ్రాసే సబ్జెక్టు ప్రశ్నాపత్రానికి అడిషనల్స్‌లో ఆన్సర్స్ వ్రాయించి వారు అధిక మార్కులతో పాసయ్యేలా చేస్తాడట. గత కొన్నేళ్లుగా ఇలాంటి అవకతవకలకు పాల్పడడంలో అతనిది అందెవేసిన చేయి. ఫెయిల్ అవుతున్న విద్యార్థులకైతే ఈ మొత్తం అధికం. దీంతో ఈ కళాశాలలో పరీక్షలు వ్రాసే విద్యార్థులు అక్రమార్కునిగా పేరొందిన ఆ క్లర్కు కోసం ఎదురు చూస్తుంటారట ఎలాగైనా తమను గట్టెక్కించమని. తమలాంటి యాజమాన్యం ఎవరూ లేరని పాఠ్యాంశాల బోధన చక్కగా చేస్తామని, సిబ్బందిని భలే చూసుకొంటామని చెప్పే కరస్పాండెంట్ దీనిని ఎందుకు అరికట్టలేక పోతున్నాడో? మొత్తం మీద ఏడుకొండల స్వామి పేరుతో గల ఈ కళాశాలలో పరీక్షల్లో జరిగే అక్రమాలను అధికారులు అరికట్టాల్సి వుంది.

కాంట్రాక్ట్ ఉద్యోగుల ధర్నా

ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటియుసీ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య జిల్లా కలెక్టర్ రాంగోపాల్‌ను కలసి వినతి పత్రాలిచ్చారు. అంతకు ముందు కలెక్టరేట్ వద్ద కాంట్రాక్ట్ కార్మికులు చేసిన ధర్నానుద్దేశించి అంకయ్య మాట్లాడారు. పెరిగిన ధరలకనుగుణంగా వీరికి వేతనాలు



కలక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు.

పెంచాలని, ఉద్యోగులు, కార్మికులకు ఇస్తున్న మాదిరి పిఎఫ్, ఈఎస్ఐ, బోనస్ సౌకర్యాలు కల్పించాలన్నారు. యూనియన్ ఎన్నికల్లో కాంట్రాక్టు కార్మికులకు ఓటు హక్కు కల్పించాలన్నారు. ధర్నాలో రెవిన్యూ అసోసియేషన్ నాయకుడు శ్రీనివాసులురెడ్డి, ఎన్జీఓ నాయకుడు శేఖర్‌బాబు, ఏపిటియుసి నాయకులు మురళీధర్, ఆంజనేయులు, సిఐటియు నాయకులు అజయ్‌కుమార్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సిఐ కార్యాలయం ముట్టడి!

గిట్టుబాటు ధర కోసం చివరి యత్నం

జిల్లా రైతులు ధాన్యానికి గిట్టుబాటు ధర ఇవ్వమని జిల్లా కలెక్టర్ మొదలుకొని ముఖ్యమంత్రి వరకు విజ్ఞాపనలు సమర్పిస్తున్నా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. దీంతో మరో దారి లేని రైతులు 24వ తేది అఖిలపక్ష రైతు సంఘం నేతృత్వంలో బృందావనంలోని ఎఫ్‌సిఐ కార్యాలయాన్ని ముట్టడించారు. ఆత్మకూరు బస్టాండ్ నుంచి ర్యాలీగా వచ్చిన నేతలు కార్యాలయం వద్ద బైఠాయించి ప్రభుత్వానికి, ఎఫ్‌సిఐ అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష రైతు సంఘం నేత మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మామూళ్లకు అలవాటు పడిన ఎఫ్‌సిఐ అధికారులు మిల్లర్లతో కుమ్మక్కై రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఎఫ్‌సిఐ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారిపోయిందన్నారు. గోడౌన్లు ఖాళీ లేవనే సాకుతో ఎఫ్‌సిఐ అధికారులు చేతులెత్తేయడంతో మిల్లర్లు రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని తక్కువకు కొనుగోలు చేస్తున్నందున ఆరుగాలం శ్రమిస్తున్న రైతులు



ఎఫ్‌సిఐ కార్యాలయం వద్ద రైతుల ధర్నా.

నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమయంలో ఎఫ్‌సిఐ ఏరియా మేనేజర్ వెంకట్రామయ్య ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందని రైతులు కార్యాలయంలోకి చొచ్చుకొని పోవడానికి ప్రయత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఘనంగా గోమతి స్కూల్ వార్షికోత్సవం

నెల్లూరు గోమతి గ్లోబల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు 19వ తేది ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సభకు స్కూల్ ఛైర్మన్ డాక్టర్ పి.రాజశేఖర్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. చదువే విద్యార్థులను సమాజంలో గౌరవనీయ స్థానంలో నిలబెడుతుందన్న విషయాన్ని గుర్తించి ముందుకు సాగాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన మహా గణపతి, ఝాన్సీ లక్ష్మీబాయి, భగత్‌సింగ్, టిప్పుసుల్తాన్, మోహినీ భస్మాసుర, గోదాదేవి కళ్యాణం కార్యక్రమాలు ఆహూతులను మంత్రముగ్ధులను చేశాయి. స్కూల్ పిల్లలు గ్రహాంతర వాసులుగా యు.ఎఫ్.ఓలో ప్రయాణించి, భూ ఉపరితలం మీద దిగి ప్రదర్శించిన అవతార్ కార్యక్రమానికి చప్పట్లు మిన్నుముట్టాయి. తదుపరి జరిగిన ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థులు తమ తల్లితండ్రులతో సహా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం



పిల్లలకు బహుమతులు పంచుతున్న డాక్టర్ రాజశేఖర్, అరుణ.

చేయడంలో స్కూల్ డైరక్టర్ అరుణ శ్రమ ప్రతిచోటా కన్పించింది.

● డాక్టర్ల వైఫల్యం

మధుమేహ పిల్లలకు శాపం

మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య నానాటికీ అధికమవుతోంది. పెద్దలతోపాటు చిన్నపిల్లల్లోనూ మధుమేహ వ్యాధి అత్యధికంగా వుండడంతో ప్రభుత్వం దీనిపై అవగాహన కల్పించి వ్యాధిగ్రస్తులకు తగిన సూచనలు అందించేందుకు, చిన్నపిల్లలకు ఉచితంగా ఇన్సులిన్ అందజేసేందుకు జాతీయ ప్రభుత్వం అందజేసే ఉచిత ఇన్సులిన్‌ను పొందలేక పోతుండడం విశేషం. ఆనాడు వైద్యవిధాన పరిషత్ కోఆర్డినేటర్‌గా వున్న డాక్టర్ చెన్నయ్య నిధులను ఖర్చుచేయడంలో పూర్తిగా విఫలం అయ్యాడు. ప్రత్యేక అధికారులుగా చెన్నయ్యతోపాటు డాక్టర్ సుధాకర్‌ను నియమించినా అధికారుల వైఫల్యం కారణంగా ఎంతో ప్రయోజనవంతంగా వుండి ముఖ్యంగా పాఠశాలల్లో చదువుతూ మధుమేహంతో బాధపడే పిల్లలకు శాపంగా మారింది. చెన్నయ్యను పనిష్‌మెంట్ కింద ఆదిలాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ చేసి, సుధాకర్‌ను తిరిగి జైలు డాక్టర్‌గా పంపించి సరిపెట్టుకొన్నారు తప్పితే రెండేళ్లుగా పిల్లలకు ఇన్సులిన్ అందకపోవడాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో వాటిని కొనే స్థోమతలేక మధుమేహ వ్యాధిగ్రస్తులైన పిల్లలు అల్లాడిపోతున్నారు.



మధుమేహ వ్యాధిగ్రస్తులైన పిల్లలకు స్కూల్లో ఇన్సులిన్ వేస్తున్న దృశ్యం.

మధుమేహ నియంత్రణ పథకాన్ని ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో ప్రారంభమైన ఈ పథకాన్ని జిల్లాలోనూ 2008లో ప్రారంభించారు. అన్నిచోట్లా విజయవంతమైన ఈ పథకం జిల్లాలో మాత్రం ఆరంభశూరత్వంగా మారింది. ప్రభుత్వం అందజేసిన నిధులను ఖర్చు పెట్టలేని అసమర్థ అధికారుల వలన జిల్లాలో పథకం తీరు కానరాకుండా పోయింది. ఫలితంగా మధుమేహంతో బాధపడే పలువురు పాఠశాల విద్యార్థులు

ఇంత అధ్వాన్నం అసెంబ్లీ ఎప్పుడూ చూడలేదు!

శాసనసభ బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. అసలు జరిగితే కదా, ముగియడానికి అన్నది పరిశీలకుల ప్రశ్న. దాదాపు 29 రోజులు సభ సమావేశమైంది. కానీ ఒక్కరోజు కూడా పట్టుమని ఒక గంటపాటు కూడా చర్చలు జరగలేదు. ప్రశ్నోత్తరాలు లేవు. సావధాన తీర్మానాలు లేవు. ప్రతిపక్ష నేతల ఉపన్యాసాలు లేవు. ప్రభుత్వ వ్యూహాలు అసలే లేవు. 29 రోజులలో మొత్తం 58సార్లు వాయిదా పడింది సభ. ఇది కూడా చరిత్రకెక్కే సంఖ్యే. ఇన్ని వాయిదాలు పడిన శాసనసభా సమావేశాలు గతంలో ఎప్పుడూ లేవు. మామూలుగా అయితే సభ ఉదయం 8 గంటలకు ప్రారంభమై 2గంటల వరకు నడుస్తుంది. అంటే రోజుకు ఆరు గంటలు చర్చలుంటాయి. బడ్జెట్ కాబట్టి చివరలో ఐదారు రోజులు మధ్యాహ్నం కూడా సభ పెట్టి, రాత్రి వరకు నడుపుతారు. ఆ లెక్క ప్రకారం మొత్తం 29 రోజులకు 225 గంటల వరకు సభ నడవాలి. కానీ ఈసారి సభ జరిగిన మొత్తం గంటలు 52 మాత్రమే. అంటే, పావు వంతు కూడా లేదన్న మాట.


సభకు రావడానికి ఎవరూ ఆసక్తి చూపలేదు. టిఆర్ఎస్ వారి అజెండా తెలంగాణ మాత్రమే. దానితో వారు సభకు రావడం, ఏదో ఒక పేచీ పెట్టుకొని వెళ్లి పోవడం చేశారు. వారు సభలో వున్నప్పుడు తామూ వెళ్తే, తెలంగాణ ద్రోహులని తిడతారనే భయంతో తెలుగుదేశం సభ్యులు, చాలా మంది కాంగ్రెస్‌వాదులు ముఖం తప్పించారు. దానితో ఎక్కువ భాగం సమయాలలో కోరానికి సరిపడా మాత్రమే సభ్యులు కన్పించేవారు లోపల. వైఎస్.వివేకానందరెడ్డి దుందుడుకుతనం వంటి సందర్భాలలో ప్రతిష్టంభన ఏర్పడి, సభ వాయిదా పడినప్పుడు ముఖ్యమంత్రి, స్పీకర్ చొరవ చూపించి దాన్ని పరిష్కారం చేయాలి. వైఎస్ కానీ, ఆయనకు ముందున్న ముఖ్యమంత్రులు కానీ ఇటువంటి సందర్భాలలో తీవ్రస్థాయి చర్చలు జరిపి, వ్యూహాలు పన్ని, మళ్లీ సభ మొదలయ్యేట్లు చూసేవారు. కానీ కిరణ్‌కు అంత ఓపిక లేదు. సభ వాయిదా పడిన ప్పుడు సమస్యను వదలిపెట్టి, బయట కార్యక్రమాలకు వెళ్లిపోయే వాడాయన. దానితో ప్రతిష్టంభనలు అట్లనే కొనసాగాయి.

రెండు పదవులూ ఖాళీ

మరొకప్రక్క శాసన సభకు స్పీకర్ లేడు. శాసన మండలికి ఛైర్మన్ లేడు. అదొక దయనీయమైన పరిస్థితి. స్పీకర్ నియామకం జరగకుండా బడ్జెట్ సమావేశాలు జరపడం ఇప్పటివరకు ఎప్పుడూ లేదు. స్పీకర్ నియామకం ముఖ్యమంత్రి చేతిలో పని. అధిష్టానంతో మాట్లాడి ఎవరో ఒకరిని ఎంపిక చేయవచ్చు. కానీ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆ చొరవ చూపలేదు. దానితో స్పీకర్ లేకుండానే సమావేశాలు మొదలై, ముగిసిపోయాయి. శాసన మండలి ఛైర్మన్‌గా చక్రపాణి పదవీకాలం ముగిసి పోయింది. ఆ గదువు తెలిసినప్పుడు, ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలి. కానీ కిరణ్ పట్టించుకోలేదు. ఇవి రెండూ రాజ్యాంగబద్ధ పదవులు. వాటినట్లా నిర్లక్ష్యం చేయడం, రాజ్యాంగాన్ని అవమానించడం క్రిందే లెక్క.

దౌర్జన్యాలతో ఆగుతుందా?

మరొకప్రక్క సభలో దౌర్జన్యాలు, దాడులు మామూలైపోయాయి. మొదటి రోజు గవర్నర్ నరసింహన్‌ను దాదాపు కొట్టినంత పని చేశారు. ఆ వెంటనే లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ్‌ను చెట్టు క్రింద పట్టుకొని కొట్టారు. మొన్నటికి మొన్న వైఎస్.వివేకానందరెడ్డి తెలుగుదేశం సభ్యుల మీద దౌర్జన్యం చేశాడు. మన శాసనసభలో ఇటువంటి సంఘటనలు గతంలో ఎప్పుడూ జరగలేదు. సభ్యుల ప్రవర్తన, ముఖ్యమంత్రి, స్పీకర్, ప్రతిపక్ష నాయకుడు వంటి పెద్దల ఉదాసీనత చూస్తే, ఈ వ్యవహార శైలి దౌర్జన్యాలతో ఆగుతుందా, అంత కంటే నీచానికి దిగజారి పోతుందా అన్న సందేహం కల్గుతున్నది.



నెల్లూరు ముచ్చట్లు

3వ పేజీ కొరవ

రంలో కాపురముంటున్నాడు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈయన కాంగ్రెస్ వర్గీయుల దగ్గర డబ్బు తీసుకొని జగన్ వర్గీయులకు ఓటేసిన దానిపై చిత్తూరు నుంచి వచ్చిన వ్యక్తులు గొడవపడ్డారు. సంఘటనా స్థలానికి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెళ్లి వ్యవహారాన్ని సర్ది వచ్చారు.

సన్మానం

తెలుగుదేశం పార్టీ 30వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆ పార్టీ సాంస్కృతిక విభాగంలో అవిరళ కృషిచేసిన దోర్నాల హరిబాబు, శింగంశెట్టి మురళీమోహన్‌ను ఆ పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు 29వ తేది హైదరాబాద్‌లో సన్మానించారు.

స్నేహం కోసం జీవితం నాశనం!

స్నేహం కోసం ఇంజనీరింగ్ చదివే విద్యార్థి తన జీవితాన్ని నాశనం చేసుకొన్నాడు. నెల్లూరు కుమ్మరవీధికి చెందిన యాసిన్ క్యూబా ఇంజనీరింగ్ కాలేజిలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పదవ తరగతిలో ఇతని స్నేహితుడు కలీమ్ తెలుగు పరీక్షను మూడేళ్లుగా తప్పుతుండగా అతని బదులుగా 24వ తేది పరీక్ష వ్రాయను వెళ్లిన యాసిన్ చివరి నిమిషంలో కాస్త గందరగోళానికి లోనై పట్టుబడ్డాడు. వన్‌టౌన్ కానిస్టేబుల్ ఎస్.దేవ కిరణ్ ఇతన్ని పట్టుకొని హెడ్‌మాస్టర్ ముందు హాజరు పరిచి వాంగ్మూలం నమోదు చేయడంతో జైలు పాలయ్యాడు.

ప్రభవలో కాన్‌స్టెల్లో లండన్!

నెల్లూరు పొగతోటలోని విలువైన పుస్తకాల భాండాగారం ప్రభవలో విశేష పురుష వస్త్ర ప్రపంచ శ్రేణికి చెందిన కాన్‌స్టెల్లో లండన్ ఉత్పత్తులు అందుబాటులో వుంచుతున్నారు. ఈ షోరూంను ఏప్రెల్ 4వ తేది సీనియర్ న్యాయవాది వేములపాటి అనంతరామయ్య ప్రారంభిస్తారు. చిట్టి ప్రభవ పేరుతో ఏర్పాటుచేస్తున్న తెలుగు, ఇంగ్లీషు, హిందీ బాలసాహిత్య పుస్తక విభాగానికి వేదం వెంకట రామన్ రిబ్బన్ కత్తిరిస్తారు. అందరినీ ఈ కార్యక్రమానికి రమ్మని పిలుస్తున్నారు ప్రభవ నిర్వాహకులు డాక్టర్ పి.శ్రీధర్, చంద్రలత.

తెలుగు యువత సంబరాలు

తెలుగుదేశం పార్టీ 30వ పడిలో ప్రవేశిస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని మద్రాసు బస్టాండ్ వద్ద గల స్పాస్టిక్ సెంటర్‌లో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రవిచంద్ర పిల్లల చేత కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్.వేంకటేశ్వర్లు, జలదంకిసుధాకర్, రాము, రవీంద్ర, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్వయంపాకులకు బ్రాహ్మణ సంఘం!

నెల్లూరు విఆర్ హైస్కూల్ మాజీ హెడ్మాస్టర్, జ్యోతిష్యవేత్త, రచయిత స్వయంపాకుల శ్రీనివాసులు జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. 27వ తేది బాలాజీనగర్‌లో సంఘం సభ్యులు సమావేశమై ఈ ఎన్నిక చేశారు. సంఘం ఉపాధ్యక్షులుగా పాముల మురళీకృష్ణ, వంకా శ్రీహరిప్రసాద్, కార్యదర్శిగా ఐ.కె.ప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా కె.ఎల్.నారాయణరావు, డాక్టర్ చుండి నాగేశ్వరరావు, కోశాధికారిగా నర సింహారావులతోపాటు మరో 14 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకొన్నారు.

రమేష్‌రెడ్డి కలకలం

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినం సందర్భంగా 29వ తేది నగరంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి తాళ్లపాక రమేష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టించాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రెండుగా చీలినా తెలుగుదేశం మూడవ స్థానంలో వుంటున్నదని దీనికి కారణం నాయకత్వంపై ప్రజలకు నమ్మకం లేకపోవడమేనన్నారు. పార్టీ బాగుపడాలంటే ముఖ్యమంత్రి అభ్యర్థిగా నందమూరి బాలకృష్ణను ప్రకటించి ఆయనకు పార్టీ బాధ్యతలు అప్పగించాలని లేకపోతే భవిష్యత్తులో పార్టీ పుంజుకొనే అవకాశాలే లేవన్నారు. రమేష్‌రెడ్డి హఠాత్తుగా చేసిన వ్యాఖ్యలతో ఎన్టీఆర్ విగ్రహం వద్దనే వున్న బీద రవిచంద్ర తదితరుల ముఖాన నెత్తురు చుక్క లేకుండా పోయింది. రమేష్‌రెడ్డి ఈ మాటలు అనేటప్పుడు తాము ప్రక్కనే వుండడంతో అధినేత చంద్రబాబుకు ఎక్కడ కోపం వస్తుందోనని బిత్తరపోయారు నేతలు.

పెరిగిన రాజరాజేశ్వరమ్మ హుండీ ఆదాయం

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో గల మూడు హుండీలను లెక్కించగా 10,09,674 రూపాయలు వసూలైంది. గతంతో పోలిస్తే హుండీ ఆదాయం పెరిగినట్లు అధికారులు చెప్తున్నారు. భక్తులు అమ్మవారిపై నమ్మకంతో హుండీల్లో ముడుపులు చెల్లించుకోవడంతో ఆదాయం పెరిగిందన్నది వాస్తవం. అమ్మవారి సొమ్మును హారతి కర్పూరం చేస్తున్న పాలకవర్గం ఈ హుండీ రాబడినైనా దేవాలయ అభివృద్ధికి వినియోగిస్తారో లేక దిగమింగుతారోనని భక్తులు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

షార్ గెస్ట్‌హౌస్‌లో మంటలు

శ్రీహరికోట షార్ గెస్ట్‌హౌస్‌లో ఇటీవల మంటలు చెలరేగడంతో విలువైన ఫర్నిచర్ దగ్ధమై ఆస్థి నష్టం సంభవించింది. షార్ ఆవరణలో గల కల్పన గెస్ట్‌హౌస్‌ను ఇస్రో ప్రతినిధులు సమావేశాలు, ఇతర రాత్రా అవసరాలకు వినియోగిస్తుంటారు. దీన్ని ఇటీవలే కోటి రూపాయలతో ఆధునీకరించారు. ఉన్నట్లుండి మంటలు రావడంతో ఫర్నీచర్, సీలింగ్ ఇతర కలప వస్తువులు కాలిపోయాయి. షార్ట్‌సర్క్యూట్ కారణంగానే మంటలు వ్యాపించినట్లు అధికారులు భావిస్తున్నారు.

జనవాణి

2వ పేజీ కొరవ

పాపం చిరంజీవి!

సిద్దడు అద్దంకిపోనూ పోయాడు రానూ వచ్చాడు అనే సామెతను గుర్తుచేస్తూ మెగాస్టార్ చిరంజీవి ఎందుకు పార్టీ పెట్టినట్లు? దాని కాంగ్రెస్‌లో ఎందుకు విలీనం చేసినట్లు?? సినిమా రంగంలోగాని రాజకీయరంగంలోగాని స్వర్గీయ ఎన్టీ రామారావుకు ఎవరూ సాటిరారు.

ఎన్వీఎస్ కోటేశ్వరరావు నెల్లూరు

ఖర నామ సంవత్సరంలో అన్నీ కష్టాలే!

రాష్ట్రంలో ఆందోళనలు అధికమవుతాయి. అన్ని రంగాల్లో అసంతృప్తి. నవంబరు, డిసెంబరు నెలల్లో రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పు.

ఈ సంవత్సరానికి చాంద్రమానమునను సరించి 'ఖర' అని పేరు.

ఈ సంవత్సరంలో

రాజు – చంద్రుడు, మంత్రి – గురువు, సేనాధిపతి – బుధుడు, సస్యాధిపతి – రవి, ధాన్యాధిపతి – శుక్రుడు, మేఘాధిపతి – బుధుడు, అర్ఘాధిపతి – బుధుడు, రసాధిపతి – కుజుడు, నీరసాధిపతి – రవి.

ఉగాది పంచాంగం

పి.ఎం.గోపాలాచారి

మౌఢ్యమి

గురు మూఢం

ఈ సంవత్సరంలో 23–3–2011 వికృతి ఫాల్గుణ బహుళ చవితి బుధవారం నాడు గురు మూఢమి ప్రారంభం అయ్యి 23–4–2011 ఖర చైత్ర బహుళ షష్ఠి శనివారం నాడు గురువు తూర్పున ఉదయించడంతో మూఢమి త్యాగం అవుతుంది. 31–8–2011 నుండి 26–12–2011 వరకు గురు వక్రము.

శుక్ర మూఢం

13–7–2011 ఖర నామ సంవత్సరం బుధవారం నుండి 25–9–2011 ఆదివారం వరకు శుక్రమూఢం.

కర్తరి

ఖర నామ సంవత్సరం 4–5–2011 తె.3.52లకు బుధ వారం, దొల్లు కర్తిరి ప్రారంభమవుతుంది.

11–5–2011 రా. 1.39లకు నిజ కర్తరి ప్రారంభమవు తుంది.

29–5–2011 ఉ. 11.06లకు ఆదివారం కర్తరీత్యాగమ వుతుంది.

రవి ఆరుద్ర ప్రవేశము

22–6–2011 ప. 11.11లకు ఖర నామ సంవత్సరము జ్యేష్ఠ బహుళ సప్తమి బుధవారం రవి ఆరుద్ర నక్షత్రంలో ప్రవేశిస్తారు.

పుష్కర నిర్ణయము

8–5–2011 నాడు ప. 2.30లకు ఖరనామ సంవత్సరం వైశాఖ శుద్ధ పంచమి ఆదివారం నాడు గురువు మేష రాశిలో ప్రవేశించడం వల్ల గంగానదీ పుష్కరాలు ప్రారంభమవుతాయి.

ఫలితాలు

ఆది శూన్యే మహావ్యాధిః, మధ్యశూన్యే మహాభయః, అంత్యశూన్యే మహాహానిః. బేసి సంఖ్య ధన లాభమును, సమ సంఖ్య సమఫలమును, శూన్య సంఖ్య ఫలమునిచ్చును. మొదటి అంకె చైత్రాది ఆషాఢం వరకు, రెండవ అంకె శ్రావణాది కార్తీకం వరకు, మూడవ అంకె మార్గశీర్షాది ఫాల్గుణం వరకు చూపుతుంది. మూడు సున్నాలు పూర్తి నిష్ఫలం చూపుతుంది.

ఆంధ్ర దేశములో ఆందోళనలు అధికమవుతాయి. రాజకీయ నాయకులలో పరస్పర అవగాహనలోపం మితిమీతుంది. కేంద్ర పరిపాలనలో మార్పుకు అవకాశం కలదు. నవంబరు, డిసెంబరులలో ప్రభుత్వ మార్పుదల చోటు చేసుకొంటుంది. ప్రజలలో తీవ్ర అసంతృప్తి అన్నిరంగాల్లో ఉంటుంది.

రాశులు	ఆదాయం	వ్యయం	రాజపూజ్యత	అవమానం
మేషం	14	2	4	5
వృషభం	8	11	7	5
మిథునం	11	8	3	1
కర్కాటకం	5	8	6	1
సింహం	8	2	2	4
కన్య	11	8	5	4
తుల	8	11	1	7
వృశ్చికం	14	2	4	7
ధనస్సు	2	11	7	7
మకరం	5	5	3	3
కుంభం	5	5	6	3
మీనం	2	11	2	6

నక్షత్రాలు				ఫలితాలు
అశ్విని	పుష్యమి	స్వాతి	అభిజిత్	కీర్తి, సన్మానాలు
భరణి	ఆశ్రేష	విశాఖ	శ్రవణం	మనస్తాపం, ఆరోగ్యలోపం
కృత్తిక	మఖ	అనూరాధ	ధనిష్ఠ	ఆరోగ్యం, ఆయుర్వృద్ధి
రోహిణి	పుబ్బ	జ్యేష్ఠ	శతభిషం	ధనం, సౌఖ్యం, లాభం
మృగశిర	ఉత్తర	మూల	పూ.భా	శత్రుబాధ, బుణవృద్ధి
ఆరుద్ర	హస్త	పూ.షా	ఉ.భా	దూర ప్రయాణాలు, రాజయోగం
పునర్వసు	చిత్త	ఉ.షా	రేవతి	బుణ బాధలు, కుటుంబ సమస్యలు


ఘనంగా త్యాగరాజ స్మరణోత్సవాలు!

పండిత పామరులను పరవశింపజేసేది సంగీతం. అలాంటి సంగీతాన్ని రసరమ్యం చేసి సామాన్యుల చెంతకు తీసుకెళ్లిన కొద్దిమంది సంకీర్తనాచార్యుల్లో త్యాగయ్య ఒకరు. తన కీర్తనల ద్వారా అందరిని రంజింప చేసిన ఆ త్యాగరాజస్వామి సంస్మరణార్థం నగరంలో ప్రతి ఏటా స్మరణోత్సవాలు నిర్వహించడం ఆనవాయితి. అది కూడా భిక్షాటన పూర్వకంగా జరపడం ఈ ఉత్సవాల ప్రత్యేకత.

త్యాగరాజస్వామి జన్మస్థలమైన తిరువాయూర్‌లో ఆయన శిష్యబృందం, భక్తగణం భిక్షాటన పూర్వకంగా సంగీతోత్సవాలు జరపడం సాంప్రదాయం. ఆ ఉత్సవాలలో కచేరి చేయడం మహద్భాగ్యంగా కర్నాటక సంగీత విద్వాంసులు భావిస్తారు. అలాంటి సంగీత కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకొని సంకీర్తనాచార్యుల స్మరణోత్సవాలను అదే పద్ధతితో భిక్షాటనా పూర్వకంగానే జరిపేందుకు శ్రీకారం చుట్టిన వ్యక్తులు శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి, యనమండ్ర వెంకటేశ్వరశాస్త్రి. వీరు 45 ఏళ్ల క్రిందట ప్రారంభించిన భిక్షాటన పూర్వక త్యాగరాజ స్మరణోత్సవాలు నేటికీ నిరాటంకంగా జరుగుతూనే వున్నాయి.

నెల్లూరు పుర వీధుల్లో త్యాగరాజ కీర్తనలు గానం చేస్తూ భిక్షమెత్తుతారు. భక్తులు ఇచ్చే మొత్తాలను సేకరించి ఆ నిధుల్తో వారం రోజులపాటు ఈ ఉత్సవాలు జరుపుతారు. ఈ ఏడాది 46వ స్మరణోత్సవాలు టౌన్‌హాలులో మార్చి 24 తేది నుంచి 31తేది వరకు సంగీతాభిమానుల నడుమ ఘనంగా జరిగాయి. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో వివిధ సంగీత కార్యక్రమాలు జరగడంతో పురమందిరం పులకించిపోయింది. హరికథా గానం, ఔత్సాహిక కళాకారుల కచేరి, ప్రముఖ విద్వాంసుల గాత్ర కచేరిలతో వారం రోజులు సంకీర్తనలతో మారుమ్రోగింది ఈ ప్రాంతం. స్మరణోత్సవాలు ప్రారంభం రోజు నుంచి ఎస్పీ శైలజ, డివి సురేష్‌రావు, లలితా మాధవన్, ఓఎస్ త్యాగరాజన్, సేలం గాయత్రి వెంకటేశన్, లక్ష్మీరంగ రాజన్, సురభిరంగరాజన్ తదితర విద్వాంసులు చేసిన గాత్ర కచేరి, సిక్కిల్ మాలాచంద్రశేఖర్ వేణుగానం రసజ్ఞులను సంగీత సాగరంలో ఓలలాడించాయి.





● ఎన్నో పాఠాలు నేర్పిన

వాకాటి ఎమ్మెల్సీ ఎన్నిక!

శాసనమండలికి నెల్లూరు స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి జరిగిన ఎన్నిక లలో కాంగ్రెస్ అభ్యర్థి వాకాటి నారాయణరెడ్డి విజయం జిల్లా రాజకీయాలను పలు రకాలుగా ప్రభావితం చేస్తున్నది. మూడు పార్టీలలోనూ సంచలనం సృష్టిస్తు న్నది. ఎన్నికలంటే రోత కల్గేట్లు, భయం పుట్టేట్లు జరిగిన ఎన్నిక ఇది. ఆ డబ్బు పందారం, డబ్బు తీసుకొన్నవారు చేసిన మోసం, నాయకులనే వారు ఆడిన నాటకాలు, రాజకీయ విధేయతలు, మొగ మాటాలు, వర్గ అనుబంధాలతో సంబంధం లేకుండా వ్యవహరించారు ఓటర్లు. ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు ఓటు చేశారు.

డబ్బు వృధా

సాధారణంగా డబ్బు తీసుకొన్న ఓటర్లలో సగం మందైనా రుణానుబంధం పాటిస్తారన్నది రాజకీయ నమ్మకం. కానీ ఈసారి అది జరగలేదు. ముగ్గురు అభ్యర్థులు పెట్టిన డబ్బంతా వృధా అయిపోయింది. అందుకు కారణం – ఒకే ఓటరుకు ముగ్గురూ డబ్బు ఇవ్వడమే. అందరూ సమాన మొత్తాలు చేతిలో పెట్టినప్పుడు, ఓటరు ఎవరికి రుణపడి వుండాలి? దానితో డబ్బు దారి, ఓటు దారి ఒకటి కాలేకపోయాయి.

ఓట్లు చెల్లా పల్లా

కాంగ్రెస్, తెలుగుదేశాలకున్న ఓట్లను చెల్లా పల్లా చేసి పారేసింది జగన్ పార్టీ. రెండు పార్టీల నుంచి ఓట్లు కొల్లగొట్టింది. జగన్ పార్టీ ఏర్పడి నప్పుడు జిపచైర్మన్ కాకాణితో కానీ; మేకపాటి, నల్లపరెడ్డి, కాటంరెడ్డిలతో కానీ అటు వలస వెళ్లిన వారి ఓటర్ల సంఖ్య రెండు వందలు కూడా లేదు. ఆ తర్వాత ఆనం రామనారాయణరెడ్డి తన అధికార బలంతో వారిలో కొందరిని వెనక్కు రప్పించాడని ప్రచారం జరిగింది. కానీ తీరా కౌంటింగ్‌లో లెక్క చూసే సరికి జగన్ అభ్యర్థికి 221 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్‌కు నికరంగా 250 ఓట్లు వుండాలి, కానీ వచ్చింది 233 మాత్రమే. తెలుగుదేశంది కూడా అదే పరిస్థితి. వారికి 230 వుండవలసి వుంటే, వచ్చింది కేవలం 183. దీన్ని బట్టి మూడు పార్టీల మధ్య ఓట్లు ఎంతగా చెల్లా చెదురై పోయాయో అర్థం చేసుకోవచ్చు.

అందరి మీదా శీల శంక

దీనితో, అటు తెలుగుదేశం, ఇటు కాంగ్రెస్ పార్టీల నేతలు తమను తాము అనుమానించుకొనే పరిస్థితి ఏర్పడింది. అందరి మీదా శీల శంక పుట్టుకొస్తున్నది. తెలుగుదేశంలో ఇది బహిరంగంగా వ్యక్తమౌతున్నది. అభ్యర్థి బీద రవిచంద్ర, తనకు తన పార్టీ నేతలే పని చేయలేదని నేరుగా చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదు చేసినట్లు వినికిడి. అయితే వాస్తవ పరిస్థితి చూస్తే, తెలుగుదేశం పార్టీకి ఆ మాత్రం ఓట్లు రావడం కూడా గొప్ప విషయంగానే పరిగణించాలన్నది నిజం. చాలా ఆలస్యంగా ఎన్నిక గోదాలోకి దిగడం ఆ పార్టీ చేసిన తప్పు. అభ్యర్థి బీద రవిచంద్ర, నామినేషన్ల ఉపసంహరణ వరకు పోటీ చేయాలా వద్ద అన్న వూగిసలాటలోనే వున్నాడు. వారు ఒక నిర్ణయానికి వచ్చి, ఓటర్లెవరో చూసుకొనే సమయానికి కాంగ్రెస్, జగన్ పార్టీలు చాలా ముందుకు వెళ్లిపోయాయి. దొరికిన వారిని దొరికినట్లు ఎత్తుకొని వెళ్లి, క్యాంప్‌లు పెట్టేశాయి. ఒకసారి క్యాంపుకు వెళ్లడమో, ఇతర అభ్యర్థుల నుంచి డబ్బు దస్కం తీసుకోవడమో చేసిన ఓటర్ను మళ్లీ పార్టీ శిబిరంలోకి రప్పించడం అంత సులువు కాదు కదా?

బుట్టలో చేపలు మాయం

కాంగ్రెస్ పరిస్థితి వేరొక రకం. అందరూ సద్బ్రాహ్మణులే, బుట్టలో చేపలు మాత్రం మాయమై పోయాయన్నట్లు వుంది దాని పరిస్థితి. జిల్లాలో కాంగ్రెస్ ఏకతాటి మీద నడిచినట్లు ప్రచారం జరగడం, నాయకులనుకొన్న వారంతా తమ తమ ఓటర్లను దగ్గరుండి క్యాంపులకు తరలించడం చేశారు కాబట్టి, కాంగ్రెస్ అభ్యర్థి కనీసం 50 ఓట్ల మెజార్టీతో నెగ్గుతాడని భావించారు. తీరా చూస్తే, పెట్టెలో ఓట్లు లేవు. ఈ తరుగుకు కారణం ఎవరన్నది చిదంబర రహస్యం. ఎవరినీ వేలెత్తి చూపించే పరిస్థితి లేదు. తమ తప్పు ఒప్పుకొనే వాళ్లు అసలు లేరు. ఓటు చేపలు తిన్న వారెవ్వరన్న నిజం ఎప్పటికీ భూస్థాపితమయ్యే వుంటుంది తప్ప బయటపడదు. ఎవరికి వారు మేము పతివ్రతలం, ఎదుటి వారే పతితలన్నట్లు మాట్లాడుతున్నారు.

నారీ నారీ నడుమ...

గెలిచిన వాకాటి నారాయణరెడ్డి మాత్రం, తన మనసులోని అభిప్రాయాలు బయటపడకుండా జాగ్రత్త పడుతున్నాడు. గెలిచామా లేదా అన్నది ముఖ్యం కానీ ఏడు ఓట్లా, డెబ్భై ఓట్లా అన్నది ప్రశ్న కాదని సరిపెట్టుకొంటున్నాడు. అయితే ఎన్నికలో అందరి సహకారం తీసుకోవడం ఇప్పుడాయనకు సమస్యగా మారింది. ఒకపక్క నేదురుమల్లి జనార్దనరెడ్డి, మరొకపక్క ఆనం రామనారాయణరెడ్డి, మూడో వైపు ఆదాల ప్రభాకర్‌రెడ్డి.... ముగ్గురినీ ఒప్పించి, మెప్పించాలి. ఏ పక్క మొగ్గు చూపించినా తతిమా వారికి కినుక. ఎవరు పిలిస్తే పోకపోయినా అప్పుడే చెయ్యిచ్చాడన్న నింద. నారీ నారీ నడుమ మురారి వలె నలిగి పోతున్నాడు పాపం. అందరి ఇళ్లలో నిలువు జీతం కాయడానికి పుణ్యకాలం హరించుక పోతున్నది.

‘జిపచైర్మన్’ పై చెయ్యి!



జిల్లా పరిషత్ కోసం కడుతున్న కొత్త భవనాన్ని అడ్డుకోవడానికి ఆనం సోదరులు చేస్తున్న విశ్వ ప్రయత్నం మరొకసారి విఫలమైంది. తమను కాదని జగన్ పార్టీలోకి వెళ్లిన జిపచైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేరు ఆ భవన ప్రారంభ శిలాఫలకం మీద లేకుండా చేయాలన్నది వివేకానందరెడ్డి కోరిక. అందుకోసం ఆయన మొదట కాంట్రాక్టర్‌ను బెదరించాడు. పని ఆపాడు. ఆ తర్వాత పోలీసు బలాన్ని ప్రయోగించి అక్కడ పని చేసే వారిని బెదరగొట్టాడు. కార్పొరేషన్ అధికారులతో గునపాలు పంపించాడు. కలెక్టర్ వంటి అధికారుల చేతులు కూడా కట్టిపడేశాడు. అయితే జిపచైర్మన్ నేరుగా హైకోర్టుకు వెళ్లి, భవన నిర్మాణం కొనసాగించడానికి అనుమతి తెచ్చుకొన్నాడు. ఆ ఉత్తర్వును కొట్టి వేయించడానికి మరొకసారి హైకోర్టుకు వెళ్లారు ఆనమీయులు. కానీ వారికి అక్కడా కాలం కలిసి రాలేదు. ఆ అప్పీలును కొట్టిపారేశాడు ప్రధాన న్యాయమూర్తి. ఇక సుప్రీంకోర్టు కూడా ఆనం వారి ఆశను తీర్చే అవకాశం లేదు. కాంట్రాక్టర్ భయపడి పారిపోయినా జిపచైర్మన్ తనే మనుషులను పెట్టి నిర్మాణ పనులు పూర్తి చేయించి వేశాడు. ఈ వారమో పై వారమో ఆయన చేతుల మీదుగానే ప్రారంభ లాంఛనం కూడా జరిగిపోబోతున్నది.

రాజకీయవాదులు అభివృద్ధిలో పోటీ పడితే ప్రజలు ఆసక్తిగా చూస్తారు. కానీ ఇట్లా జరుగుతున్న అభివృద్ధి పనులను అడ్డుకొని తమ బలం ప్రదర్శించాలని చూస్తే అదే ప్రజలు ఛీ కొడతారు. వివేకానందరెడ్డికి పేరులో మాత్రమే వివేకమనే పెన్నిధి పెట్టాడు భగవంతుడు. అందులో ఆయన తప్పేమీ లేదు పాపం.

“జిపచైర్మన్” ప్రభ దేదీప్యమానం

ఈ ఎన్నికలలో పదవి వచ్చింది వాకాటి నారాయణరెడ్డికి అయినా, పలుకుబడి పెరిగింది మాత్రం జిపచైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డికి అన్నది నిజం. జిపచైర్మన్ సామాన్యుడు కాదన్న ప్రచారం బాగా జరిగిపోతున్నది. ఆయన ప్రభ దేదీప్యమానంగా వెలిగి పోతున్నది.



జగన్ అయస్కాంత శక్తి!

రాజకీయాలలో కొత్త ఎప్పుడూ వింతే. ఇప్పుడా కొత్తదనం వైఎస్ జగన్‌లో మాత్రమే వుంది. కొన్ని సందర్భాలలో పాత నేతలకది పరువు సంకటంగా మారుతున్నది. రేవుల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోదరుడి వివాహ నిశ్చితార్థానికి కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి, ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి వచ్చారు. వారి చుట్టూ ఆనం రామనారాయణ రెడ్డి, రఘువీరారెడ్డి వంటి మంత్రులు అరడజను మంది గుమిగూడారు. వారి పిచ్చాపాటీ మాటలు కొనసాగుతున్నప్పుడే వైఎస్.జగన్ వేదిక దగ్గరకు వచ్చాడు. ఇంకేముంది, మంత్రులంతా పాలోమని అటు పరుగులెత్తారు. పాపం పెద్దలిద్దరూ ఒంటరి వారై పోయారు. పరువు నిలుపుకోవడానికి చెప్పా పెట్టకుండా సైగ్గా లేచి, కారెక్కి వెళ్లిపోయారు. తెలుగుదేశం ఎమ్మీ రాథోడ్ ఇంట్లో చంద్రబాబు నాయుడుకూ ఇదే పరిస్థితి. వైఎస్.జగన్, ఆయన ఒకేసారి వచ్చారు. జనమంతా జగన్ చుట్టూ చేరారు. చంద్రబాబు ఒంటరిగా నిలబడవలసి వచ్చింది. రాథోడ్ పరుగెత్తుకొని వచ్చి, తమ పార్టీ నేత పరువు కాపాడాడు.

కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కెవిపి. రామచంద్రరావును పలకరించడానికి కిరణ్ వచ్చిన వెంటనే జగన్ కూడా గదిలోకి వచ్చాడు. రామనారాయణరెడ్డి సహజంగానే అటు వెళ్లాడు. కిరణ్ మౌనంగా లేచి బయటకు రాక తప్పలేదు. ఎవరెన్ని చెప్పినా, జగన్‌కు జన అయస్కాంత శక్తి వుంది ఇప్పుడు. దాని బారిన పడకుండా వుండాలంటే, ఆయనున్న చోటును తప్పించుకోవడం ఒక్కటే దారి. ఆ జాగ్రత్తలు తీసుకోకుంటే ఇటువంటి సంకటాలు తప్పవు.

ఇది కూడా ఒక చరిత్రే!



ఒకటికి పదమూడుసార్లు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రిగా రోశయ్యకు చరిత్రలో స్థానం దొరికింది. అయితే మొదటి సారి ఆర్థికమంత్రిగా బడ్జెట్ పుస్తకం తీసుకవెళ్లిన ఆనం రామనారాయణరెడ్డి కూడా మరొక రకంగా చరిత్రలో స్థానం సంపాదించాడు. సాధారణంగా బడ్జెట్ అంటే, మొదట ప్రసంగం, ఆ తర్వాత దానిపై చర్చ, అది ముగియగానే 42 రకాల పద్దుల మీద చర్చ, ఆ తర్వాత సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలిస్తూ ముగింపు ప్రసంగం వుంటాయి. కానీ రామనారాయణరెడ్డికి ఈ బాదర బందీ ఏదీ లేదు. ఆయన ప్రవేశపెట్టిన బడ్జెట్ మీద ఒకరోజు కూడా చర్చ జరగలేదు. పద్దుల ప్రస్తావన అసలే లేదు. అందువల్ల సమాధానం చెప్పే అవసరం రాలేదు. బడ్జెట్ చర్చ, సమాధానాలు లేని ఏకైక ఆర్థికమంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి చరిత్ర పుస్తకంలో చోటు సంపాదించుకొన్నాడు. చరిత్రలో మిగిలాడా లేదా అన్నది ముఖ్యం కానీ అది ఏ రకం చరిత్ర అని ఎవరూ అడగరు కదా?

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.